సంపుటి : 9
సంచిక : 346
సోమవారం
07 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!
Contact For Ads:
7579339999





**అమరావతి, విశ్వం వాయిస్ ప్రత్యేక కథనం:**
ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు వేగం పుంజుకుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియకు అవసరమైన వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాల తయారీ, ప్రచురణపై చర్యలు చేపట్టింది. 2026 జనవరి 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితాల ఆధారంగా మున్సిపల్ వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు సిద్ధం చేస్తున్నారు. అయితే ఓటర్ల జాబితాల ప్రక్రియ పూర్తవడం అంటే వెంటనే పోలింగ్ తేదీ ప్రకటించబడిందని కాదు. రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర దశలు ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుంది.

**ఎన్నికలు ఎలా జరుగుతాయి?**

పట్టణ స్థానిక సంస్థల్లో ప్రధానంగా రెండు రకాల ఎన్నికల వ్యవస్థ ఉంటుంది.

**1. మున్సిపాలిటీలు / నగర పంచాయతీలు**

ప్రతి మున్సిపాలిటీని వార్డులుగా విభజిస్తారు. ప్రతి వార్డు నుంచి ఒక వార్డు సభ్యుడిని/కౌన్సిలర్‌ను ప్రజలు ఎన్నుకుంటారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి సంబంధించిన ఎన్నికల విధానం, రిజర్వేషన్ తదితర అంశాలు ప్రభుత్వం జారీ చేసే నోటిఫికేషన్లు, వర్తించే చట్టాలు/నిబంధనల ప్రకారం ఉంటాయి.

**2. మున్సిపల్ కార్పొరేషన్లు**

కార్పొరేషన్ పరిధిని వార్డులుగా విభజించి ప్రతి వార్డు నుంచి కార్పొరేటర్‌ను ప్రజలు ఎన్నుకుంటారు. మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు సంబంధించిన ఎన్నికల విధానం కూడా వర్తించే చట్టం, ప్రభుత్వం నిర్ణయించే విధానం, ఎన్నికల నోటిఫికేషన్‌పై ఆధారపడి ఉంటుంది. మొత్తం ఎన్నికల పర్యవేక్షణ, ఓటర్ల జాబితాలు, ఎన్నికల నిర్వహణపై ప్రధాన రాజ్యాంగబద్ధ అధికారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘానిదే.

**ఓటర్ల జాబితా ఎందుకు అంత కీలకం?**

మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయడానికి సంబంధిత మున్సిపాలిటీ/కార్పొరేషన్ వార్డు ఓటర్ల జాబితాలో పేరు మిగతా .. 2లో..

జగన్‌కు డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి

# తేడా తెలియదు

**రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్**



**విజయవాడ, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధ్యాయులపై వైకాపా అధినేత జగన్‌కు ఏమాత్రం గౌరవం లేదని రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ విమర్శించారు. దేవుళ్లుగా భావించే గురువులను గత ప్రభుత్వంలో వైన్ షాపుల వద్ద క్యూ లైన్లలో నిలబెట్టి అవమానించారని ధ్వజమెత్తారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య కనీస తేడా కూడా తెలియని వ్యక్తి జగన్ అని ఎద్దేవా చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమై.. 12 లక్షల మంది విద్యార్థులు బడికి దూరమయ్యారని మండిపడ్డారు. 16 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగుల పట్ల మంత్రి నారా లోకేష్ చిత్తశుద్ధిని చాటుకున్నారని స్పష్టం చేశారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ పోస్టు కూడా భర్తీ చేయని మిగతా .. 2లో..

విజయవాడ హ్యుందాయ్ కార్ల షోరూంలో

# భారీ అగ్నిప్రమాదం

**భవనం పైఅంతస్తులో ఒక్కసారిగా చెలరేగిన మంటలు**
**భారీగా ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా**

**విజయవాడ, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ నగరంలోని ఆటోనగర్‌లో ఉన్న హ్యుందాయ్ కార్ల షోరూంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఆదివారం నాడు షోరూంకు సెలవు కాగా, ఎవరూ లేకపోవడంతో పెను ప్రాణనష్టం తప్పింది. భవనం పైఅంతస్తు నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని హ్యుందాయ్ షోరూం భవనం పైభాగం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు భవనం పైఅంతస్తును పూర్తిగా చుట్టుముట్టాయి. దట్టమైన పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకోవడంతో సమీప నివాసితులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే స్థానికులు మిగతా .. 2లో..

# రాజమండ్రిలో కుండపోత

**ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వాన**
**లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రిలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం మిగతా .. 2లో..

ఉప్పాడ తీర రక్షణ గోడ నిర్మాణానికి

# సర్వే పనులు ప్రారంభం

- పవన్ కల్యాణ్ చొరవతో రంగంలోకి మద్రాస్ ఐఐటీ బృందం
- డిజైన్, డీపీఆర్ రూపకల్పన కోసం రంగంలోకి ఐఐటీ మద్రాస్ నిపుణులు
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో కదులుతున్న పనులు
- అత్యాధునిక టెక్నాలజీతో తీరప్రాంతంపై సమగ్ర అధ్యయనం
- దశాబ్దాల సముద్ర కోత సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు



**ఉప్పాడ, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** దశాబ్దాలుగా సముద్ర కోతతో విలవిలలాడుతున్న పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడ తీరప్రాంత వాసుల చిరకాల స్వప్నం సాకారం దిశగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక చొరవతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. ఈ ప్రాజెక్టు డిజైన్, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన కోసం ప్రతిష్ఠాత్మక ఐఐటీ-మద్రాస్ నిపుణుల బృందం రంగంలోకి దిగింది. గత వారం రోజులుగా ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఐదుగురు సభ్యుల నిపుణుల బృందం ఉప్పాడ తీరంలో క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించింది. అత్యాధునిక డ్రోన్లు, మిగతా .. 2లో..

టీడీపీ నేత వసంత్ కుమార్ కుటుంబాన్ని

# పరామర్శించిన మంత్రి లోకేశ్

**ఇటీవల టీడీపీ నేత చెరుకూరి వసంత్ కుమార్ మృతి**
**చిత్తూరు జిల్లా పెద్దకాల్వ గ్రామంలో లోకేశ్ పర్యటన**
**కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ**



**చిత్తూరు, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ చిత్తూరు జిల్లాలో పర్యటించారు. ఇటీవల కన్నుమూసిన టీడీపీ సీనియర్ నేత చెరుకూరి వసంత్ కుమార్ కుటుంబాన్ని ఆయన మిగతా .. 2లో..

# కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్ ఫ్లాప్ : కేసీఆర్



**సిద్దిపేట, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీ సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పకుండా హాజరుకావాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. శాసనసభ, మండలిలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలన్నారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశాలను మిగతా .. 2లో..

నాపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన

# కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి : కవిత



**బంజారాహిల్స్, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక మాధ్యమాల్లో తనపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన చేసిన కానిస్టేబుల్‌ను సర్వీస్ నుంచి రిమూవ్ చేయకుండా రాష్ట్ర డీజీపీ సస్పెండ్‌తోనే సరిపెట్టారని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై కేసు పెట్టి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు చేపట్టకుంటే.. అంతర్జాతీయ వేదికలపై ప్రభుత్వం తీరును మిగతా .. 2లో..

గ్రామ నిధులు నేరుగా సర్పంచులకే అందేలా

# త్వరలో కొత్త బిల్లు : మంత్రి సీతక్క



**గచ్చిబౌలి, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ సర్పంచులు నిత్యం ఎదురయ్యే ఒత్తిళ్లు, విమర్శలను తట్టుకొని మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని మంత్రి సీతక్క అన్నారు. నిధుల విడుదల విషయంలో ఉప సర్పంచుల చెక్ పవర్‌కు సంబంధించి గత ప్రభుత్వ హయాంలో వచ్చిన చట్టంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ అంశాన్ని మిగతా .. 2లో..




టోల్‌గేట్ వద్ద వాహనదారుల నుంచి అక్రమ వసూళ్లు..

# నెల్లూరులో రవాణా అధికారి అరెస్ట్

**నెల్లూరు జిల్లాలో రవాణా శాఖ అధికారులపై ఏసీబీ ఆకస్మిక దాడులు**
**లంచాలు వసూలు చేస్తున్న ఎంవీఐ, ఇద్దరు హోంగార్డులు పట్టివేత**
**కారులో దాచిన రూ.1.80 లక్షలతో సహా సుమారు రూ. 2.5 లక్షల నగదు స్వాధీనం**



**నెల్లూరు, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో రవాణా శాఖలో అవినీతి మరోసారి బట్టబయలైంది. వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న అధికారులపై మిగతా .. 2లో..

# ఏపీలో కొత్త పింఛన్లు

**దరఖాస్తులకు ప్రభుత్వం శ్రీకారం**

**అమరావతి, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు సహా వివిధ వర్గాల నుంచి సెప్టెంబర్ 7 నుంచి 16 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు మిగతా .. 2లో..

వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువలో

# ఇద్దరు యువకులు గల్లంతు

**గల్లంతైన వారిలో పెళ్లికి ఒక్కరోజు ముందు కాబోయే వరుడు**
**ఈతకు వెళ్లి నీటి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయిన స్నేహితులు**
**ప్రాజెక్టు ప్రారంభమయ్యాక ఐదు రోజుల్లో ఇది రెండో ప్రమాదం**



**వెలిగొండ, సెప్టెంబర్ 06, విశ్వం వాయిస్ న్యూస్ :** పెళ్లికి ఒక్కరోజు ముందు ఆ ఇంట్లో ఆనందం వెల్లివిరియాల్సింది. బంధుమిత్రుల సందడితో కళకళలాడాల్సిన పెళ్లి పందిరి మూగబోయింది. సరదాగా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ఏపీలో మున్సిపల్ ఎన్నికల సమరం!

ఉండాలి. చట్ట ప్రకారం మున్సిపాలిటీ ఓటర్ల జాబితా అసెంబ్లీ ఓటర్ల జాబితాలోని సంబంధిత ప్రాంతాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించబడుతుంది. మున్సిపాలిటీ వార్డులుగా విభజించబడినప్పుడు ఓటర్ల జాబితా కూడా వార్డు వారీగా విభజించబడుతుంది.

**అందువల్ల:** ఓటరు జాబితా ? వార్డు వారీ ఓటర్ల సంఖ్య ? సామాజిక వర్గాల గుర్తింపు? రిజర్వేషన్లు? అభ్యర్థుల ఎంపిక ? ఎన్నికల నోటిఫికేషన్ అనే క్రమంలో ప్రక్రియ ముందుకు సాగుతుంది.

**ఎస్సీ.. ఎస్టీ.. బీసీ.. మహిళలకు రిజర్వేషన్లు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు అత్యంత కీలకమైన అంశం. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, బీసీలకు ప్రభుత్వం నిర్ణయించే నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు, మహిళలకు నిర్దేశిత వాటా రిజర్వేషన్లు ఉంటాయి.

**అందుకే ప్రతి వార్డులో:** ఈసారి ఏ కేటగిరీ? ఎస్సీనా? ఎస్టీనా? బీసీనా? మహిళా రిజర్వేషనా? లేక జనరల్‌నా? అన్నది రాజకీయ పార్టీలకు అత్యంత కీలకం కానుంది. మున్సిపల్ చైర్‌పర్సన్/ఇతర స్థానాల రిజర్వేషన్ కూడా ప్రభుత్వ నిర్ణయాలు, వర్తించే చట్టాలు మరియు అధికారిక నోటిఫికేషన్ల ఆధారంగా ఖరారవుతుంది.

**ఎవరు కౌన్సిలర్‌గా పోటీ చేయవచ్చు?**

**మున్సిపాలిటీ వార్డు సభ్యుడిగా పోటీ చేసే వ్యక్తికి ప్రధానంగా:**

సంబంధిత మున్సిపాలిటీ/నగర పంచాయతీ ఓటర్ల జాబితాలో పేరు ఉండాలి.

కనీసం 21 సంవత్సరాల వయస్సు ఉండాలి.

రిజర్వ్‌డ్ వార్డు అయితే సంబంధిత ఎస్సీ/ఎస్టీ/బీసీ వర్గానికి చెందినవారై ఉండాలి.

మహిళలకు రిజర్వ్ చేసిన స్థానానికి మహిళా అభ్యర్థి కావాలి.

రిజర్వ్‌డ్ కేటగిరీకి చెందిన అభ్యర్థి జనరల్ స్థానంలో కూడా పోటీ చేయవచ్చు.

కానీ అర్హత ఒక్కటే సరిపోదు!

చట్టపరమైన అనర్హతలు ఉన్నా పోటీకి అవకాశం ఉండదు.

**ఉదాహరణకు:**

కొన్ని ప్రభుత్వ/స్థానిక సంస్థల లాభదాయక పదవులు

మున్సిపాలిటీతో కొనసాగుతున్న కొన్ని కాంట్రాక్టు ప్రయోజనాలు

చట్టప్రకారం నిర్దేశించిన కొన్ని నేరాల్లో శిక్ష

దివాలా వంటి నిర్దిష్ట పరిస్థితులు

వర్తించే చట్టంలోని ఇతర అనర్హతలు

రెండు కంటే ఎక్కువ మంది పిల్లలకు సంబంధించిన చట్టపరమైన అనర్హత నిబంధన వంటి అంశాలు పరిశీలనలోకి వస్తాయి.

**అభ్యర్థి ఎంపికలో పార్టీలకు అసలు పరీక్ష!**

ఈ ఎన్నికల్లో కేవలం పార్టీ గుర్తు మాత్రమే గెలిపించదు.

ప్రతి వార్డులో పార్టీలు ప్రధానంగా ఈ అంశాలను పరిశీలించే అవకాశం ఉంది:

1. అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్
2. వార్డులో ఉన్న ఓటు బ్యాంక్
3. సామాజిక వర్గాల సమీకరణం
4. స్థానిక సమస్యలపై అభ్యర్థి పోరాటం
5. గతంలో చేసిన ప్రజా సేవ
6. ఆర్థికంగా ఎన్నికను ఎదుర్కొనే సామర్థ్యం
7. పార్టీ క్యాడర్‌తో సమన్వయం
8. మహిళలు, యువతలో ప్రభావం
9. రెబల్ అభ్యర్థులను ఎదుర్కొనే సామర్థ్యం
10. స్థానిక ఎమ్మెల్యే/నియోజకవర్గ నాయకత్వంతో సంబంధాలు. ఇవే అనేక వార్డుల్లో అభ్యర్థి విజయావకాశాలను ప్రభావితం చేసే అంశాలుగా మారే అవకాశం ఉంది.

**నామినేషన్ నుంచి కౌంటింగ్ వరకు..**

**ఎన్నికల పూర్తి అధికారిక షెడ్యూల్ వచ్చిన తర్వాత సాధారణంగా కీలక దశలు ఇలా ఉంటాయి:**

ఎన్నికల నోటిఫికేషన్ : పోటీ చేసే స్థానాలు, రిజర్వేషన్లు, నియోజకవర్గ/వార్డు వివరాలు అధికారికంగా వెల్లడవుతాయి.

నామినేషన్ల స్వీకరణ : అభ్యర్థులు నిర్ణీత ఫారంలో నామినేషన్ దాఖలు చేస్తారు.

నామినేషన్ల పరిశీలన : అభ్యర్థి అర్హతలు, పత్రాలు, రిజర్వేషన్ కేటగిరీ తదితర అంశాలను పరిశీలిస్తారు.

అభ్యంతరాలు : నామినేషన్లపై అభ్యంతరాలు ఉంటే నిబంధనల ప్రకారం పరిశీలిస్తారు.

ఉపసంహరణ : అర్హత పొందిన అభ్యర్థులకు నిర్ణీత గడువులో నామినేషన్ ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది.

తుది అభ్యర్థుల జాబితా : పోటీలో ఉన్న అభ్యర్థులు, వారికి కేటాయించిన గుర్తులు ప్రకటిస్తారు.

ప్రచారం : పార్టీలు, అభ్యర్థులు వార్డు స్థాయిలో ప్రచారం నిర్వహిస్తారు.

పోలింగ్ : నిర్దేశించిన తేదీన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారు.

కౌంటింగ్ - ఫలితాలు : ఎన్నికల సంఘం నిర్ణయించిన కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

**ఇప్పుడు రాజకీయ సమీకరణాలు ఎలా ఉన్నాయి?**

**కూటమి వర్సెస్ వైసీపీ**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అధికారంలో ఉన్నది టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం. అందువల్ల పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు అధికార కూటమికి ఒక కీలక రాజకీయ పరీక్షగా మారనున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు స్థానిక ఎన్నికల్లో కూడా సమన్వయంతో ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఉన్న సీట్ల పంపకం ఫార్ములానే మున్సిపల్ ఎన్నికల్లో యథాతథంగా అమలు చేయబోమని జనసేన ఇప్పటికే స్పష్టం చేసింది. స్థానికంగా ఏ పార్టీకి బలమైన సంస్థాగత స్థావరం ఉందో దాని ఆధారంగా సీట్ల పంపకం ఉండాలని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**అంటే..** కూటమి ఒకటే అయినా.. ప్రతి వార్డులో టికెట్ కోసం టీడీపీ-జనసేన-బీజేపీ నాయకుల మధ్య స్థానిక పోటీ కూడా ఉండే అవకాశం ఉంది. ఇదే కూటమికి అతిపెద్ద అంతర్గత సవాలు కావచ్చు.

**టీడీపీ వ్యూహం**

అధికార పార్టీగా టీడీపీ:

ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, పట్టణ మౌలిక సదుపాయాలు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాలు, పెట్టుబడులు, అభివృద్ధి, వంటి అంశాలను ప్రచారంలోకి తీసుకెళ్లే అవకాశం ఉంది. స్థానిక ఎన్నికల్లో కూటమి సమన్వయం కోసం ఇప్పటికే కార్యకర్తలు, నాయకులు కలిసి పనిచేయాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది.

**జనసేన వ్యూహం**

జనసేనకు ఈ ఎన్నికలు మరో కీలక పరీక్ష. 2024 తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో అధికార భాగస్వామిగా ఉన్న జనసేన ఇప్పుడు గ్రామం, వార్డు, మున్సిపాలిటీ స్థాయిలో తన సంస్థాగత బలాన్ని పరీక్షించుకోవాల్సి ఉంటుంది. అందుకే బలమైన క్యాడర్ ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ స్థానాలను కోరే అవకాశం ఉంది.

ఇక్కడ ప్రధాన ప్రశ్న:

కూటమి అభ్యర్థి ఎవరు? ఏ పార్టీకి టికెట్? స్థానికంగా ఎవరి క్యాడర్ బలంగా ఉంది? అనేది కీలకంగా మారనుంది.

**బీజేపీ పాత్ర**

బీజేపీ కూడా కూటమిలో భాగస్వామి. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి వార్డులో సమాన స్థాయి సంస్థాగత బలం ఉండకపోయినా, కొన్ని పట్టణాలు, ప్రత్యేక సామాజిక/వ్యాపార వర్గాల్లో ఉన్న ప్రభావం కీలకంగా మారవచ్చు. కూటమి ఓట్లు చీలకుండా మూడు పార్టీల మధ్య సమన్వయం జరిగితే బీజేపీకి కూడా ప్రాధాన్యం పెరగవచ్చు.

**వైసీపీకి ఇది పునరాగమన పరీక్ష**

ప్రధాన ప్రతిపక్షంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు అత్యంత కీలకం. 2021లో జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీకి గణనీయమైన ఆధిపత్యం వచ్చింది. 2024లో రాష్ట్ర రాజకీయ పరిస్థితి పూర్తిగా మారిపోయినప్పటికీ, స్థానిక స్థాయిలో వైసీపీకి ఉన్న పాత క్యాడర్, వ్యక్తిగత నాయకుల ప్రభావం కొన్ని వార్డుల్లో ఇప్పటికీ పోటీని ప్రభావితం చేయగలదని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది.

**అందుకే వైసీపీకి ప్రధాన లక్ష్యం:**

క్యాడర్‌ను తిరిగి యాక్టివ్ చేయడం ం బలమైన స్థానిక అభ్యర్థులను నిలబెట్టడం ం ప్రభుత్వ వ్యతిరేక ఓటును సమీకరించడం. ఇటీవల వైసీపీ నేతలు స్థానిక సంస్థల ఎన్నికలను ఓటర్ల తుది జాబితా ప్రక్రియతో అనుసంధానించి ఎన్నికల నిర్వహణపై తమ అభ్యంతరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు.

**కాంగ్రెస్ పరిస్థితి?**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ప్రధాన పోటీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి వర్సెస్ వైసీపీ మధ్య ఉండే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. అయితే కాంగ్రెస్ పూర్తిగా ఎన్నికల బరిలో లేకపోతుందని చెప్పడం సరైంది కాదు. కొన్ని పట్టణాల్లో స్థానికంగా బలమైన నాయకులు ఉంటే కాంగ్రెస్ పోటీ చేయవచ్చు. అయితే రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన పోటీదారుగా నిలవాలంటే పార్టీకి బలమైన స్థానిక క్యాడర్, అభ్యర్థులు, ఓటు బదిలీ సామర్థ్యం అవసరం. అందువల్ల కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా సీట్ల కంటే స్థానిక రాజకీయ పునర్నిర్మాణానికి ఒక అవకాశంగా మారవచ్చు.

**స్థానిక ఎన్నికల్లో అసలు గెలిపించేది ఎవరు?**

పార్టీనా? అభ్యర్థినా? సామాజిక సమీకరణమా? స్థానిక సమస్యలా? వాస్తవానికి ఈ నాలుగు అంశాల కలయికే ఫలితాలను ప్రభావితం చేయవచ్చు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి అంశాలు ప్రధానంగా ఉంటే, మున్సిపల్ ఎన్నికల్లో మాత్రం ఓటరు తన రోజువారీ సమస్యలను ఎక్కువగా పరిగణించే అవకాశం ఉంటుంది.

"మా వార్డులో రోడ్డు ఎవరు వేయించారు?"

"డ్రైనేజీ సమస్య ఎవరు పరిష్కరించారు?"

"తాగునీరు ఎలా ఉంది?"

"చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోందా?"

"స్ట్రీట్ లైట్లు వెలుగుతున్నాయా?"

"కౌన్సిలర్ అందుబాటులో ఉంటారా?"

ఇలాంటి ప్రశ్నలే అనేక వార్డుల్లో కీలకం కావచ్చు.

**ఈసారి కీలకంగా మారనున్న 10 అంశాలు**

1. బీసీ రిజర్వేషన్లు, 2. మహిళా రిజర్వేషన్లు, 3. వార్డు వారీ ఓటర్ల సంఖ్య, 4. కూటమి సీట్ల పంపకం, 5. వైసీపీ అభ్యర్థుల ఎంపిక, 6. రెబల్ అభ్యర్థుల ప్రభావం, 7. స్థానిక ఎమ్మెల్యేల పాత్ర, 8. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతులు, 9. వ్యక్తిగత ఓటు బ్యాంక్, 10. కూటమి ఓట్ల బదిలీ.

**ఒకే మాటలో చెప్పాలంటే..**

ఏపీలో మున్సిపల్ ఎన్నికలు కేవలం కౌన్సిలర్లను ఎన్నుకునే ఎన్నికలు కావు. ఇవి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి అధికార బలం ఎంత? వైసీపీకి క్యాడర్ బలం ఎంత మిగిలింది? కాంగ్రెస్, వామపక్షాలకు స్థానిక స్థాయిలో పునరాగమన అవకాశం ఉందా? అన్నది తేల్చే రాజకీయ పరీక్షగా కూడా మారనున్నాయి. అయితే ప్రస్తుతం పూర్తి పోలింగ్ తేదీ, తుది అభ్యర్థుల జాబితా, ప్రతి వార్డు రిజర్వేషన్, నామినేషన్ తేదీలు అధికారికంగా ఖరారయ్యే వరకు ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో ముందుగానే చెప్పడం కేవలం అంచనా మాత్రమే. ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాత.. రిజర్వేషన్లు ఖరారై.. అభ్యర్థుల ఎంపిక మొదలైన వెంటనే అసలు మున్సిపల్ రాజకీయ సమరం మొదలుకానుంది.

# తేడా తెలియదు

వైకాపా ప్రభుత్వం ఇప్పుడు అవాస్తవాలు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. చట్టసభలకు వచ్చే ధైర్యం లేకపోయినా ప్రెస్‌మీట్ల ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారని జగన్‌పై విమర్శలు గుప్పించారు.

# భారీ అగ్నిప్రమాదం

అగ్నిమాపక శాఖకు, పోలీసులకు సమాచారం అందించారు. హూటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది పలు ఫైర్ ఇంజన్ల సాయంతో మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించారు. ఆదివారం సెలవు కావడంతో షోరూంలో సిబ్బంది గానీ, వినియోగదారులు గానీ ఎవరూ లేరు. ఇదే రోజు పనిదినం అయ్యుంటే ఊహించని స్థాయిలో ప్రాణనష్టం జరిగి ఉండేదని అధికారులు అభిప్రాయపడ్డారు. భవనం పైఅంతస్తులో సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ప్రమాదం కారణంగా భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత నష్టంపై పూర్తిస్థాయిలో అంచనా వేయనున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని, అగ్నిమాపక శాఖ అధికారులతో కలిసి ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

# రాజమండ్రిలో కుండపోత

సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం మారిపోయి భారీ వర్షం ముంచెత్తింది. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతో వర్షపు నీరు రోడ్లపైనే భారీగా నిలిచిపోయింది. దీంతో రోడ్లు చెరువులను తలపించాయి. ఫలితంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర అవస్థలు పడ్డారు. ముఖ్యంగా దానవాయిపేట, ఆవారోడ్డు, ప్రకాశ్ నగర్ సహా పలు ప్రధాన కూడళ్లలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం పనుల మీద బయటకు వెళ్లినవారు, ఇళ్లకు తిరిగి వెళ్లేవారు అకస్మాత్తుగా కురిసిన వర్షంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతిసారీ చిన్నపాటి వర్షానికే నగరం ఇలా జలదిగ్బంధంలో చిక్కుకోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం కారణంగానే ఈ దుస్థితి తలెత్తుతోందని వారు ఆరోపిస్తున్నారు.

# సర్వే పనులు ప్రారంభం

బీచ్ ప్రొఫైలింగ్, ట్రింబుల్ ఆర్980 జీఎన్ఎస్ఎస్ ఆర్‌టీకే వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తీరం వెంబడి సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. సముద్ర గర్భంలోనూ, తీరం పొడవునా భౌగోళిక పరిస్థితులు, అలల తీవ్రత, సముద్ర ప్రవాహాల దిశ, కోతకు గల కారణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నారు. ఇందులో భాగంగా సముద్రపు లోతును కొలిచే బాతిమెట్రిక్ సర్వేతో పాటు, తీరంలోని ఇసుక, మట్టి నమూనాలను సేకరించి పరీక్షిస్తున్నారు. గత 40 ఏళ్లుగా ఉప్పాడ తీరంలో సముద్ర కోత కారణంగా వందల ఎకరాల భూమి, కొన్ని గ్రామాలు సముద్రంలో కలిసిపోయాయి. ఎందరో మత్స్యకారులు, రైతులు సర్వం కోల్పోయి నిర్వాసితులుగా మారారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు నడుం బిగించిన పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.323 కోట్ల జాతీయ విపత్తు నిర్వహణ నిధిని సాధించారు. ఈ ప్రాజెక్టు పనులను పవన్ కళ్యాణ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. డిజైన్, డీపీఆర్ రూపకల్పనతో పాటు సమాంతరంగా పర్యావరణ అనుమతుల ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలో పిఠాపురం పర్యటన సందర్భంగా ఐఐటీ నిపుణులతో సమావేశమై పనుల పురోగతిని సమీక్షించనున్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత ఐఐటీ మద్రాస్ ఇచ్చే నివేదిక ఆధారంగా రక్షణ గోడ డిజైన్‌ను ఖరారు చేసి, నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

# పరామర్శించిన మంత్రి లోకేశ్

పరామర్శించారు. గంగాధర నెల్లూరు మండలం పెద్దకాల్వ గ్రామంలోని వసంత్ కుమార్ నివాసానికి వెళ్లిన లోకేశ్, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వసంత్ కుమార్ చిత్రపటానికి లోకేశ్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీకి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన లోకేశ్, వారికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను నారా లోకేశ్ తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు.

# కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్ ఫ్లాప్ : కేసీఆర్

ఎవరూ లైట్ తీసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "శాసనసభ, మండలిలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రజల అజెండానే బీఆర్ఎస్ అజెండాగా ఉండాలి. కాంగ్రెస్, భాజపా విధానాలను ఎండగట్టాలి. స్పీకర్ పక్షపాత ధోరణి, అప్రజాస్వామిక విధానాలపై నిలదీయాలి. కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన అట్టర్‌ఫ్లాప్. తమ ప్రభుత్వం మళ్లీరాదని కాంగ్రెస్ నేతలకు అర్థమైంది. అందుకే అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. నా చావు కోరుతూ పదేపదే మాట్లాడుతున్నారు. పాలన చేతకాకే రేవంత్‌రెడ్డి బూతు పురాణం. అలాంటి వ్యక్తితో చర్చకు అసెంబ్లీకి రావాలా?సమావేశాల్లో అధికార పార్టీ నేతలు నా గురించి మాట్లాడే యత్నం చేస్తే పట్టించుకోవద్దు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాల పైనే పోరాడాలి. రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం గోస పెడుతోంది. కృష్ణా, గోదావరి జలాల అంశంపై ఉద్ధృత పోరాటం చేయాలి. రాజకీయాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు. పంపులు ఎందుకు ఆన్ చేయడం లేదు? కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల వద్దకు వెళ్దాం. నియోజకవర్గాల పునర్విభజన కచ్చితంగా జరుగుతుంది" అని కేసీఆర్ అన్నారు.

**సమావేశాలు నెలరోజులు నిర్వహించేలా ప్రభుత్వంపై ఒత్తిడి: హరీశ్‌రావు**

శాసనసభ, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ శాసనసభా పక్ష సమావేశం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. "కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన పూర్తయింది. అన్నివర్గాలనూ ఈ ప్రభుత్వం మోసం చేసింది. రైతులు, నిరుద్యోగులు, రైతులు, బలహీనవర్గాలు, మహిళలకు తీరని ద్రోహం చేసింది. అసెంబ్లీ సమావేశాలను నెలరోజులపాటు నిర్వహించేలా బీఏసీలో ఒత్తిడి తేవాలని కేసీఆర్ సూచించారు. సభలో మాట్లాడాల్సిన అంశాలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన పలు సూచనలు చేశారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి అంశాలపై నిలదీయాలని చెప్పారు." అని హరీశ్‌రావు తెలిపారు.

# కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేయాలి : కవిత

ఎండగడతానని హెచ్చరించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. మహిళలపై అసభ్యంగా మాట్లాడిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు చెబుతున్నాయని, అవి డీజీపీకి తెలియదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా.. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు కల్లలు గానే మిగిలిపోయాయన్నారు. బీసీల కోసం ధర్నాలు చేస్తామని కాంగ్రెస్ నేతలు చెప్పడం పెద్ద జోక్ అని కవిత అన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆక్షేపించారు. మాజీ మంత్రి కొండా సురేఖ అంశం ఆ పార్టీ అంతర్గత విషయమన్నారు.

# త్వరలో కొత్త బిల్లు : మంత్రి సీతక్క

ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి తెలిపారు. గ్రామాలకు అభివృద్ధి నిధులు ఆగిపోకుండా.. నిధులు నేరుగా సర్పంచులకే అందేలా త్వరలో అసెంబ్లీలో కొత్త బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో సర్పంచుల కోసం 'సమర్థవంతమైన నాయకత్వం ద్వారా గ్రామ ప్రగతి' అనే అంశంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయడమే కాదు ప్రజల్లో నైతిక విలువలను పెంపొందించే దిశగా సర్పంచులు నాయకత్వం వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన 9 రకాల ఆదర్శ గ్రామ అంశాలను సర్పంచులు ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణ పట్ల సర్పంచులకు అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాజయోగిని బ్రహ్మకుమారి సంతోష్ దీదీ మాట్లాడుతూ.. సర్పంచులు నిస్వార్థంగా ప్రజాసేవ చేయాలని అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, శాంతి సరోవర్ డైరెక్టర్ కుల్‌దీప్ తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో రవాణా అధికారి అరెస్ట్

అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జరిపిన ఈ ఆకస్మిక తనిఖీల్లో సుమారు రూ. 2.5 లక్షలకు పైగా లెక్కల్లో చూపని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఓ మోటారు వాహన తనిఖీ అధికారి (ఎంవీఐ)ని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సెప్టెంబర్ 5, 6 తేదీల మధ్య రాత్రి నెల్లూరు జిల్లా కావలి సమీపంలోని జాతీయ రహదారి-16పై ఉన్న ముసునూరు టోల్‌ప్లాజా వద్ద రవాణా శాఖ అధికారులు వాహనదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఏసీబీకి పక్కా సమాచారం అందింది. దీంతో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఎంవీఐగా పనిచేస్తున్న బానావత్ గోపీ నాయక్.. ఇద్దరు హోంగార్డులు, ఒక ప్రైవేట్ డ్రైవర్ సాయంతో లంచాలు స్వీకరిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల సమయంలో రోడ్డు పక్కన పడి ఉన్న రూ. 68,800 నగదును అధికారులు గుర్తించారు. అనంతరం ఎంవీఐ గోపీ నాయక్ ప్రయాణిస్తున్న కియా సెల్టోస్ కారును సోదా చేయగా, డిక్కీలో దాచిపెట్టిన రూ. 1,80,000 నగదు బయటపడింది. ఈ మొత్తం రూ. 2,48,800కు ఎలాంటి లెక్కలు లేకపోవడంతో అక్రమ వసూళ్లకు సంబంధించినదిగా భావిస్తూ ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై తదుపరి విచారణ నిమిత్తం కేసు నమోదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ అధికారులపై లంచాల ఆరోపణలు తరచూ వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది మార్చి నెలలో కూడా ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై మచిలీపట్నంలో ఏఎంవీఐగా పనిచేస్తున్న లోకనాథ ప్రసాద్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ శాఖల్లో ఎక్కడైనా అవినీతి, లంచాల బెడద ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఏసీబీ అధికారులు ప్రజలను కోరారు. టోల్ ఫ్రీ నంబర్ 1064 లేదా మొబైల్ నంబర్ 94404 40057 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# ఏపీలో కొత్త పింఛన్లు

ఏర్పాటు చేసి.. దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధరణ అనంతరం దశలవారీగా కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 61,92,396 మంది పింఛనుదారులకు నెలకు రూ.2,694 కోట్ల మేర పంపిణీ చేస్తుండగా.. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు పింఛన్ల కోసం రూ.73,508 కోట్లు ఖర్చు చేసింది.

# ఇద్దరు యువకులు గల్లంతు

ఈతకు వెళ్లిన కాబోయే పెళ్లికొడుకు, అతని స్నేహితుడు వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువలో గల్లంతవ్వడంతో ఆ కుటుంబం కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. ఈ హృదయవిదారక ఘటన మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం కటకానిపల్లెలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కటకానిపల్లె గ్రామానికి చెందిన పుష్పాల రాజ్‌కుమార్‌కు (23) ఈ నెల 7వ తేదీన వివాహం నిశ్చయమైంది. ఈ సందర్భంగా స్నేహితులు, బంధువులతో కలిసి మొత్తం ఏడుగురు పార్టీ చేసుకునేందుకు గ్రామ సమీపంలోని వెలిగొండ ఫీడర్ కాలువ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో రాజ్‌కుమార్, అతని స్నేహితుడు వినయ్‌కుమార్ (22), మరో స్నేహితుడు రాజు సరదాగా ఈత కొట్టేందుకు కాలువలోకి దిగారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నుంచి నల్లమల సాగర్‌కు నీటిని విడుదల చేస్తుండటంతో ఫీడర్ కాలువలో నీటి ప్రవాహం అత్యంత ఉద్ధృతంగా ఉంది. ఈ విషయాన్ని అంచనా వేయకుండా నీటిలోకి దిగడంతో ముగ్గురూ ప్రవాహ వేగానికి అదుపుతప్పారు. వారిలో రాజు అతికష్టం మీద ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోగా, రాజ్‌కుమార్, వినయ్‌కుమార్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. స్నేహితుల కళ్ల ముందే వారు గల్లంతవ్వడంతో ఒడ్డున ఉన్నవారు షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మరికొన్ని గంటల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన కొడుకు విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధితుల ఫిర్యాదుతో యర్రగొండపాలెం సీఐ అజయ్‌కుమార్, పోలీసులు అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభమైన ఐదు రోజుల వ్యవధిలోనే ఇది రెండో ప్రమాదం కావడం గమనార్హం. ప్రాజెక్టు ప్రారంభమైన తొలిరోజే సుంకేసుల - కలనూతల మార్గంలో బొలెరో వాహనం బోల్తా పడి ముగ్గురు గాయపడ్డారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున కాలువ వద్దకు వెళ్లవద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా, ప్రజలు పెడచెవిన పెట్టడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎడిటర్ వాయిస్

## కూటమి రెండేళ్ల పాలన.. 4 ప్లస్సులు - 3 మైనస్సులు..!

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వం కొలువుదీరి దాదాపు రెండున్నరేళ్లు (2024 జూన్ నుండి) పూర్తయింది. ఈ నేపథ్యంలో కూటమి పాలనపై ప్రజాభిప్రాయం ఎలా ఉందన్నది ఆసక్తికరం. అంతేకాదు.. భవిష్యత్తులో తీసుకునే నిర్ణయాలకు వచ్చే ఎన్నికల నాటికి ఏవిధంగా ముందుకు సాగాలన్న వ్యూహాలు వేసుకునేందుకు కూడా ప్రజల అభిప్రాయం కీలకంగా మారింది. ఈ రకంగా చూస్తే.. ప్రస్తుతం ప్రజల్లో కూటమిపై మిశ్రమ అభిప్రాయం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనలు, రాజకీయ విశ్లేషణలు, వివిధ సర్వేల ప్రకారం ప్రజాభిప్రాయం 4 ప్లస్సులుగా, 3 మైనస్సులుగా సాగుతోందని చెబుతున్నారు. అనుకూల అంశాల విషయానికి వస్తే.. రాజధాని అమరావ తి, పోలవరం పునరుద్ధరణ బాగానే పనిచేస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన రాజధాని అమరావతి పనులను వేగవంతం చేయడం, పోలవరం పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంపై ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతోంది.

అలానే, సంక్షేమ పథకాలు, పెన్షన్ల పెంపు కూడా ప్రభుత్వానికి సానుకూలత తీసుకువచ్చాయి. సామాజిక పెన్షన్లను పెంచడం, వాటిని లబ్ధిదారులకు సకాలంలో అందజేయడం ప్రజల్లో మంచి నమ్మకాన్ని కలిగించింది. అదేసమయంలో గత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలపై కూడా కొంత మేరకు సానుకూలంగానే వాతావరణం కనిపిస్తోంది. 'తల్లికి వందనం', 'దీపం 2.0- వంటి పథకాలను దశలవారీగా ప్రారంభించడం మహిళా ఓటర్లలో సానుకూల ప్రభావం చూపుతోంది.

అదేవిధంగా పెట్టుబడులు, ఉద్యోగాల వ్యవహారం కూడా సానుకూలతను పెంచింది. రాష్టానికి టాటా టీసీఎస్, ఐబీఎం వంటి పెద్ద కంపెనీలను తీసుకురావడం, పరిశ్రమల పునరుద్ధరణ ద్వారా యువతకు ఉపాధి కల్పనపై భరోసా పెరిగింది.ఇక, మైనస్‌ల విషయానికి వస్తే.. హామీల అమలులో జాప్యం సర్కారుకు ఇబ్బందిగా మారింది. 'సూపర్ సిక్స్' లోని హామీలైన నిరుద్యోగ భృతి, మహిళలకు 1500 వంటివి వర్తించకపోవడంపై ప్రజల్లో కొంత అసంతృప్తి ఉంది.

అలానే, ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున అప్పులు చేస్తోందని, దీనివల్ల భవిష్యత్తులో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుందనే ఆరోపణలను ప్రతిపక్షాలు గుప్పిస్తున్నాయి. ఇవి కూడా ప్రజల్లో చర్చకు వస్తున్నాయని సర్వేలు చెబుతున్నాయి. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై విమర్శలు చేసేవారిపై కేసులు పెట్టడం, ప్రతిపక్ష నాయకులను వేధించడం వంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయని విమర్శకులు పేర్కొంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## భోగాపురంలో దారుణం..

### చేతులు, మెడకు తాళ్లు కట్టి నడిరోడ్డుపై లాక్కుంటూ..



**డెంకాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయనగరం జిల్లా భోగాపురంలో దారుణం చోటుచేసుకుంది. ఓ యువకుడిపై మెకానిక్ మహేశ్ దౌర్జన్యానికి పాల్పడ్డాడు. చేతులు, మెడకు తాళ్లు కట్టి తొలుత నడిపించుకుంటూ.. ఆ తర్వాత బైక్‌తో లాక్కుంటూ నడిరోడ్డుపై తిప్పాడు. బైక్ రిపేర్ డబ్బులు ఇవ్వలేదనే కారణంతో మెకానిక్ ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. బాధితుడిని రామచంద్రరాజుపేటకు చెందిన యువకుడికిగా గుర్తించారు. మెకానిక్ మహేశ్‌తో పాటు అతడికి సహకరించిన మరో నలుగురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ దామోదర్ తెలిపారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు.

## ఉపాధ్యాయుడికి.. ఓ టీవీ విలేకరుల బెదిరింపులు

### ధ్రువపత్రాలు చూపించకపోతే అంతుచూస్తామంటూ వేధింపులు

**చిత్తూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** 'తప్పుడు పత్రాలతో ఉద్యోగం పొందావు.. నీ ఎడ్యుకేషన్, ఆర్మీకి సంబంధించిన ధ్రువపత్రాలు చూపించు' అంటూ మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించిన చక్రపాణిరెడ్డిని చిత్తూరు జిల్లా కుప్పంలో ఓ టీవీ విలేకరులు వేధించారు. ఉపాధ్యాయ దినోత్సవం రోజు తరగతి గదిలోకి వచ్చి విద్యార్థుల ఎదుట తన చొక్కా పట్టుకుని వారు దౌర్జన్యం చేశారని, అంతు చూస్తామన్నారని బాధితుడు వాపోయారు. ఆయన ప్రస్తుతం కుప్పం మండలం నడుమూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. ఈ బెదిరింపులకు సంబంధించి ఓ టీవీ స్థానిక విలేకరి గణేష్, కెమెరామెన్ శ్రీకాంత్‌లపై శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. అంతకుముందు బిగ్ టీవీ విలేకరి ఒకరు ఇదేవిధంగా బెదిరించారన్నారు. 'మాది అన్నమయ్య జిల్లా చింతపర్తివారిపల్లి. 2005లో సైన్యంలో చేరా. హవల్దార్ హోదాలో పనిచేసి, 2023లో రిటైర్ అయ్యా. తర్వాత బీఈడీ చేశా. మెగా డీఎస్సీలో మాజీ సైనికోద్యోగులు, ఈడబ్ల్యూఎస్, క్రీడా కోటాలో హారిజాంటల్ రిజర్వేషన్ కింద స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉద్యోగం పొందా. టెట్‌లో 79.47 మార్కులొచ్చాయి. నాకు 60 మార్కులొస్తే చాలు. 90 మార్కులు రాలేదని, తప్పుడు పత్రాలతో ఉద్యోగం పొందానంటూ దుష్ప్రచారం చేస్తున్నారు'అని చక్రపాణిరెడ్డి తెలిపారు. 'చక్రపాణిరెడ్డి ఉద్యోగం వ్యవహారంపై మేం విచారించాం. నిబంధనల ప్రకారమే ఆయనకు ఉద్యోగం వచ్చింది. నియామకంలో ఏ తప్పిదమూ జరగలేదు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం' అని డీఈవో లక్ష్మీనారాయణ తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య.. ముగ్గురి మృతదేహాలు లభ్యం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థిక ఇబ్బందులతో గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ముగ్గురి మృతదేహాలు దొరికాయి. వీరవాసరం మండలం మత్స్యపురికి చెందిన నంబూరి శ్రీనివాస్(45), పద్మిని(42) దంపతులు. వీరికి వెంకట ఈశ్వర్(16), నిత్యశ్రీ(12) అనే ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక శనివారం తెల్లవారుజామున కుటుంబంతో సహా చించినాడ వంతెన వద్దకు వచ్చి గోదావరిలో దూకారు. అక్కడి జాలర్లు వెంటనే పద్మినిని కాపాడారు. ఇప్పుడు ముగ్గురి మృతదేహాలు సఖినేటిపల్లి మండలం దిండి వద్ద గుర్తించారు. శ్రీనివాస్ ఇరవై ఏళ్ల క్రితం కుటుంబంతో సహా తణుకు వచ్చి కొట్టువారి వీధిలో స్థిరపడ్డారు. పట్టణంలో ఓ దుకాణం అద్దెకు తీసుకొని పాలు, కిరాణా వ్యాపారం చేస్తున్నారు. అది అంతంతమాత్రంగానే సాగుతుండటంతో అప్పులు చేశారు. ఇటీవల వాటిని చెల్లించాలని వడ్డీ వ్యాపారులు ఒత్తిడి చేశారు. పద్మిని పేరిట రాసిన రెండు లేఖలను పోలీసులు గుర్తించారు. 'మేం నలుగురు సూసైడ్ చేసుకోవడానికి వెళ్తున్నాం. మా గురించి ఎవరూ వెతకొద్దు. ఇంటి కాగితాలకు రూ.2.60 లక్షలు కట్టాలి. పైన నంబర్‌కు ఫోన్ చేసి కాగితాలు తెచ్చుకో. అమ్మా నన్ను క్షమించు' అని వాటిల్లో రాసి ఉంది.

### కేరళంలో లారీని కారు ఢీకొని

## 8 మంది విద్యార్థుల దుర్మరణం



**చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ :** వారందరూ ఒకే కళాశాలలో చదువుతున్న విద్యార్థులు. బాగా చదివి గొప్ప ఇంజినీర్లు అవుదామని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొద్దామని కలలు కన్నారు. కళాశాలకు సెలవులు రావడంతో సరదాగా కొత్త ప్రాంతాలను చూసొద్దామని వెళ్లారు. కానీ, ఊహించని రీతిలో రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. కేరళంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన ఇది. పోలీసుల వివరాల మేరకు.. త్రిశ్శూర్ జిల్లా కైపమంగళం జాతీయ రహదారి పక్కన ఓ లారీ ఆగి ఉంది. అదే మార్గంలో శుక్రవారం అర్ధరాత్రి 11.40 గంటల సమయంలో వచ్చిన కారు.. లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. కారు మొత్తం నుజ్జునుజ్జయింది. అందులోని ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. మృతులు తమిళనాడులోని దిండుగల్ పీఎస్ఎన్ఏ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు.. మదురైకి చెందిన జోశ్వా కిల్సన్, మురళీకృష్ణన్, ప్రసన్న, సంతోష్, దిండుగల్‌కి చెందిన యువ సంజిత్, జీవా, సూర్య, సేలంకు చెందిన విశ్వగా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం త్రిశ్శూర్ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించారు.

## హైదరాబాద్ శివారులో కోడిపందేలు.. 22 మంది అరెస్టు

**శంషాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ నగర శివార్లలో నిర్వహిస్తున్న కోడి పందేలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారంతో దాడి చేసి 22 మందిని అరెస్టు చేశారు. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడ ఆర్టీవో కార్యాలయం వెనుక ఓ పాత పౌల్ట్రీ ఫామ్‌లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆదిభట్ల పోలీసులతో కలిసి శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నిందితుల నుంచి రూ.3.60 లక్షలు, 31 పందెం కోళ్లు, 146 కోడి కత్తులు, 20 సెల్‌ఫోన్లు, స్కోర్ నోట్‌బుక్ స్వాధీనం చేసుకున్నారు. 3 కార్లు, 3 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. సీజ్ చేసిన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. పౌల్ట్రీ ఫామ్ నిర్వాహకులు ఇతర ప్రాంతాల నుంచి బెట్టింగ్‌దారులను పిలిపించి, కోడి పందేల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో ప్రధాన నిర్వాహకుడు, భూమి యజమాని పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కోడి పందేలు, జూదానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## నర్సుపై హత్యాచారం.. మెజిస్టీరియల్ విచారణకు సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో ఇటీవల హత్యాచారానికి గురైన నర్సు(21) కేసుపై మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి సత్వర న్యాయం అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దర్యాప్తును అత్యంత పకడ్బందీగా పూర్తిచేయాలన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు. కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి ఏడు నెలలుగా రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ప్రైమ్ కేర్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. ఆసుపత్రి సమీపంలో వీరి కోసం నిర్మించిన గదిలో నివాసం ఉంటోంది. ఆమెపై కన్నేసిన బిహార్‌కు చెందిన సనా ఉల్లాఖాన్.. ఆమె ఒంటరిగా ఉండడాన్ని గమనించి మద్యం మత్తులో యువతి నివసిస్తున్న గది కిటీకీలోంచి లోపలకి దూరాడు. నిద్రలో ఉన్న యువతి.. అలికిడి కావడంతో మేల్కొంది. సనా ఉల్లాఖాన్‌ను చూసి కేకలు వేసింది. ఆమె నోరు మూసి అతడు అత్యాచారానికి యత్నించాడు. ప్రతిఘటించడంతో గొంతు నులిమాడు. ఊపిరాడక అపస్మారక స్థితికి చేరిన యువతిపై అఘాయిత్యానికి తెగబడ్డాడు. ఆమె మరణించినట్టు గుర్తించి పారిపోయాడు. అనంతరం సీసీటీవీ కెమెరాల ద్వారా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



# విశ్వంవాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




సోమవారం, 07 సెప్టెంబర్, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత

www.viswamvoice.com







# విద్యుత్ వ్యవస్థ పై లోడ్ ఎక్కువ.. పరిష్కారానికి వేగం తక్కువ!

- విద్యుత్ వ్యవస్థ పై 'లోడ్' ఎక్కువ.. పరిష్కారానికి వేగం తక్కువ!
- లోవోల్టేజీతో ఇళ్లలో మంటలు.. తరచూ విద్యుత్ అంతరాయాలు
- ప్రత్యేక ఫీడర్ హామీ ఏమైంది?.. తాత్కాలిక మరమ్మతులతోనే కాలయాపన
- తక్కువ ఎత్తులో విద్యుత్ వైర్లు.. నిప్పురవ్వలతో భయాందోళనలు
- కింది స్థాయి సిబ్బంది పర్యవేక్షిస్తున్నా.. అవసరమైన సహకారం కరువేనా?

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:**

మండల కేంద్రమైన రాయవరంలో విద్యుత్ సమస్యలు ప్రజలకు నిత్య కష్టాలుగా మారుతున్నాయి. ఒకవైపు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం.. మరోవైపు లోవోల్టేజీ సమస్య.. ఇంకోవైపు ప్రమాదకరంగా ఇనుప స్తంభాలతో తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లు.. ఇలా సమస్యలు ఒక్కొక్కటిగా పేరుకుపోతున్నా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలోని రాజరాజేశ్వరి కాలనీ, వెలమపేట, మఠం వీధి, ఇందిరా కాలనీ, అరుంధతీపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, లోవోల్టేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ ఉన్న సమయంలోనూ వోల్టేజ్ హెచ్చుతగ్గులు ఉండటంతో ఇళ్లలోని విద్యుత్ పరికరాల భద్రతపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. శుక్రవారం అరుంధతీపేటలో వోల్టేజ్ సమస్య తీవ్రరూపం దాల్చడంతో పలు ఇళ్లలోని ఇన్వర్టర్లకు మంటలు రావడం కలకలం రేపింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగకపోయినా.. విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా విలువైన పరికరాలు దెబ్బతింటే అందుకు ఎవరు బాధ్యత వహిస్తారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### ప్రత్యేక ఫీడర్ హామీ ఏమైంది?

వేసవి తీవ్రత సమయంలో విద్యుత్ వినియోగం పెరగడంతో రాయవరంలోని పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో మండల కేంద్రానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా అవసరమైన పనులు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే సమయం గడిచేకొద్దీ ఆ హామీ మరుగునపడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా ప్రత్యేక ఫీడర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రస్తుతం రాయవరం మండల కేంద్రంలోని పలు ప్రాంతాలు గ్రామీణ ప్రాంతాల ఫీడర్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా లోడ్ రిలీఫ్ లేదా ఇతర సాంకేతిక కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచినప్పుడు దాని ప్రభావం మండల కేంద్రమైన రాయవరంలోని ప్రాంతాలపైనా పడుతోంది. మండల కేంద్రానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ అమలైతే ఈ సమస్యకు కొంతవరకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉన్నప్పటికీ.. ఆ దిశగా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నా.. లైన్ల సమస్య ఎందుకు?

అన్ని ప్రాంతాల లో అవసరమైన మేరకు పుష్కలంగా ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నప్పటికీ వాటికి అనుగుణంగా విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని పెంచడంలో మాత్రం తగిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. పెరిగిన విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా లైన్లను ఆధునీకరించకపోవడం వల్ల లోవోల్టేజీ సమస్యతో పాటు, తరచూ విద్యుత్ వైర్లు తెగిపడి సరఫరా నిలిచిపోతున్నాయని చెబుతున్నారు. అధికారులు సమస్య తలెత్తినప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి సరఫరాను పునరుద్ధరిస్తున్నప్పటికీ.. కొద్దిరోజులకే అదే సమస్య మళ్లీ పునరావృతమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఏబీ కేబుల్ వ్యవస్థను అవసరమైన ప్రాంతాల్లో కండక్టర్ లైన్లుగా మార్చి, విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని పెంచితే లోవోల్టేజీ, లైన్ బ్రేక్‌డౌన్ సమస్యలను కొంతవరకు నియంత్రించే అవకాశం ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

### ప్రధాన రహదారిపై విద్యుత్ వైర్లు.. ఎప్పుడు ఏం జరుగుతుందో?

రాయవరం ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా తక్కువ ఎత్తులో పాత ఇనుప స్తంభాలకు ఉన్న విద్యుత్ వైర్లు, ఎప్పుడు ఏ ప్రమాదానికి కారణమవుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళ ల్లో ఎత్తుగా ఊక, బూడిద వంటి లోడ్లతో ప్రయాణించే లారీలు విద్యుత్ వైర్లను తాకుతున్నాయని, ఆ సమయంలో నిప్పురవ్వలు రావడం భయాందోళనకు గురిచేస్తోందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ వైర్లు తెగిపడినా, వాహనాలకు విద్యుత్ ప్రసారం జరిగినా తీవ్ర ప్రమాదం సంభవించే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో తడిగా ఉండే పరిస్థితుల కారణంగా ఇనుప స్తంబాలతో ప్రమాద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. తక్కువ ఎత్తులో ఉన్న వైర్లను సురక్షిత ఎత్తుకు పెంచడంతో పాటు అవసరమైన చోట వంగిపోయిన, పాడైపోయిన పాత ఇనుప స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

### కింది స్థాయి సిబ్బంది శ్రమిస్తున్నా.. సహకారం ఎక్కడ?

విద్యుత్ సమస్యలు తలెత్తిన ప్రతిసారీ కింది స్థాయి అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ మరమ్మతులు చేపడుతున్నారని పలువురు చెబుతున్నారు. సమస్యను గుర్తించి అప్పటికప్పుడు సరఫరాను పునరుద్ధరించేందుకు వారు తమవంతు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంటున్నారు. అయితే వారికి అవసరమైన సాంకేతిక వనరులు, మౌలిక సదుపాయాలు, నిధులు, వ్యవస్థాపరమైన సహకారం పైస్థాయి నుంచి తగినంతగా అందకపోవడం వల్లే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం లేదనే వాదన స్థానికుల్లో వినిపిస్తోంది. కింది స్థాయి సిబ్బంది ఎంతగా శ్రమించినా పాత లైన్లు, తక్కువ సామర్థ్యం ఉన్న వ్యవస్థ, పెరుగుతున్న విద్యుత్ లోడ్ వంటి సమస్యలను పైస్థాయిలో ప్రణాళికాబద్ధంగా పరిష్కరించకపోతే ఫలితం ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. సమస్య వచ్చినప్పుడల్లా మరమ్మతులు చేయడం ఒక పరిష్కారం కావచ్చు.. కానీ అదే సమస్య పదేపదే వస్తుంటే మూలకారణాన్ని పరిష్కరించడమే అసలైన బాధ్యత కాదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### ప్రమాదం జరిగిన తర్వాతే మేల్కొంటారా?

రాయవరం మండల కేంద్రంలో విద్యుత్ సమస్యలు ఒక్కరోజులో పుట్టుకొచ్చినవి కావని.. గత కొంతకాలంగా పలు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు చెబుతున్నారు. సమస్య వచ్చినప్పుడు అధికారులు స్పందించి తాత్కాలికంగా పరిష్కరిస్తున్నప్పటికీ.. మళ్లీ అదే సమస్య పునరావృతమవుతుండటమే అసలు ఆందోళనకు కారణంగా మారింది. ఏదైనా ప్రమాదం జరిగాక శాశ్వత చర్యలు చేపట్టడం కంటే ముందస్తుగానే సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు. వేసవిలో ఇచ్చిన ప్రత్యేక ఫీడర్ హామీని ఇకనైనా కార్యరూపంలోకి తీసుకురావాలని, విద్యుత్ లైన్లను ఆధునీకరించాలని, లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు--వైర్లను మార్చాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజలకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా రాయవరం విద్యుత్ వ్యవస్థపై సమగ్ర సాంకేతిక సమీక్ష నిర్వహించి, తాత్కాలిక మరమ్మతులకు స్వస్తి పలికి శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### విద్యుత్ వోల్టేజ్ హెచ్చుతగ్గులతోనే ఇన్వర్టర్ కాలిపోయింది

"అరుంధతీపేటలో విద్యుత్ సరఫరాలో ఒక్కసారిగా వోల్టేజ్ హెచ్చుతగ్గులు వచ్చాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఇన్వర్టర్‌లో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. అదృష్టవశాత్తూ మంటలు ఇంట్లోని ఇతర ప్రాంతాలకు వ్యాపించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విద్యుత్ సరఫరాలో తరచూ ఇలాంటి సమస్యలు రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులు ఈ సమస్యను చిన్నదిగా చూడకుండా వెంటనే పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలి. విద్యుత్ హెచ్చుతగ్గుల కారణంగా మా ఇన్వర్టర్ కాలిపోయి ఆర్థిక నష్టం జరిగింది. ఇలాంటి ఘటనలు మరోసారి జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి."



**చంద్రమళ్ళ సంజయ్ రాజు**
**రాజరాజేశ్వరి కాలనీ, రాయవరం**

### "ప్రత్యేక ఫీడర్ పనులు త్వరగా చేపట్టాలి"

"రాయవరం మండల కేంద్రంలో లోవోల్టేజీ, తరచూ విద్యుత్ అంతరాయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో ఇచ్చిన హామీ మేరకు రాయవరానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చర్యలను అధికారులు వెంటనే చేపట్టాలి. అలాగే ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు, స్తంభాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేయాలి. ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందేలా శాశ్వత పరిష్కారం చూపాలి"



**పొలిమాటి సుధాకర్**
**మండల కో-ఆప్షన్ సభ్యులు, రాయవరం**

వాకర్స్ యోగ & లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో

# ఉపాధ్యాయ దినోత్సవం, షెడ్డు ప్రారంభం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** వాకర్స్ యోగ & లాఫింగ్ క్లబ్ కు వృద్ధుల సౌకర్యార్థం భవాని చారిటబుల్ ట్రస్ట్ నిర్మించిన షెడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమం, ఉపాధ్యాయుల దినోత్సవం శనివారం జరిగింది. నూతనంగా నిర్మించిన షెడ్డును భవాని చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, హితకారిని సమాజం ట్రస్ట్ బోర్డు చైర్మన్ యాళ్ల ప్రదీప్ సుకుమార్ ప్రారంభించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించే కార్యక్రమం క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్ కాసా జయప్రద, రిటైర్డ్ టీచర్ బి.రుక్మాబాయి, సాటిలైట్ సిటీ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నున్న ప్రశాంతి, వాసవి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ డైరెక్టర్ పాలసానపల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు, సామాజిక కార్యకర్తలు, దాతలు గ్రంధి శివానంద్ సువర్చల లను క్లబ్ సెక్రటరీ గుబ్బల గంగాభవాని వేదిక మీదకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పాలసానపల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు వారి సోదరుడు జగ్గారావు వర్ధంతి సందర్భంగా వాసవి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ప్రతిభ కలిగిన ముగ్గురు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15000 చొప్పున 45 వేల రూపాయలను ఉపకార వేతనంగా క్లబ్ ద్వారా అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయులైన కాసా జయప్రద, బీ.రుక్మాభాయ్, నున్న ప్రశాంతి లను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీతలు, ముఖ్య అతిథులు, క్లబ్ సభ్యులు కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్, కందుకూరి వీరేశలింగం పంతులు దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులు గ్రంధి శివానంద్, సువర్చల మాట్లాడుతూ తమ వంతు సహాయ సహకారాలను క్లబ్ కు ఎప్పుడు అందిస్తామని అన్నారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ 500 చొప్పున 80 మంది వృద్ధులకు రూ.40 వేలు వృద్ధాప్య పెన్షన్లుగా అందజేశారు. స్వర్గీయ వి. సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుమార్తె మాధురి 100 మంది వృద్ధులకు అల్పహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో భేరి రత్నాంబ, లంకే శ్రీదేవి, మొగల్తూరు దుర్గ, పామర్తి అవనిజ, గీసాల సరోజినీ, గీతా విజయలక్ష్మి, విజయ లక్ష్మి దంపతులు, వేముల పల్లి బాబ్జి రామకృష్ణ, కాపు, దుబ్బిరెడ్డి వెంకట్రావు, సూరపురెడ్డి తాతా రావు, గీసాల బాపూజీ, సీలం రామకృష్ణ, ఉప్పులూరి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు ఈ కార్యక్రమం క్లబ్ వ్యవస్థాపకులు పామర్తి గోపాలరావు ఆధ్వర్యంలో జరిగింది.







# మున్సిపల్ ఎన్నికలకు కూటమి సమర శంఖం

**విజయమే లక్ష్యంగా రామచంద్రపురంలో కూటమి శ్రేణుల సమాయత్తం**

**మంత్రి సుభాష్ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్**



**రామచంద్రపురం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న మున్సిపల్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని రామచంద్రపురం పట్టణంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమాయత్తమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా స్థానిక గుబ్బలవారి పేటలో "కూటమి ప్రభుత్వం ఆత్మీయ సమావేశం" నిర్వహించారు. ఈ సమావేశానికి 24, 25, 26,27, 28 వార్డులకు చెందిన కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని నాయకులు, కార్యకర్తల్లో ఎన్నికల ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి అత్యధిక వార్డులను ఏకగ్రీవం చేసుకునే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ఐక్యతే మన బలం.. ప్రజల విశ్వాసమే మన విజయానికి పునాది అని పేర్కొన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ 250 కోట్ల రూపాయలతో రామచంద్రపురం పట్టణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సత్యం కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు. పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ఎన్నికలను సమష్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. వార్డు స్థాయి నుంచి ప్రతి కార్యకర్త ఎన్నికల సైనికుడిగా పనిచేస్తే కూటమి విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని, అభివృద్ధిని కోరుకునే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి అభ్యర్థులు పనిచేయాలని సూచించారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అభివృద్ధి చేసిన నాయకత్వం ఒకవైపు.. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు మరోవైపు. రామచంద్రపురం ప్రజలు అభివృద్ధి వైపే నిలబడతారన్న నమ్మకం తమకు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, దంగేటి గౌరీ శంకర్, కట్టా నాగేశ్వరరావు, కంచుమర్తి బాబురావు, పదం శ్రీరామచంద్రమూర్తి, గుబ్బల వెంకటరమణ, వాసంశెట్టి బాల, కుడుపూడి ఫణి తేజ, కొండ్రెడ్డి శ్రీనివాసరావు, దొమ్మలపాటి విజయలక్ష్మి, చింతాకుల ప్రకాష్, నల్లా సుధాకర్, మట్ట భద్రరావు, దంగేటి వీరభద్రరావు, ఆయా వార్డుల ముఖ్య నాయకులు , పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



**రావులపాలెం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మండలం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వేదిరేశ్వరం నందు138 వ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని కొనియాడారు. ముందుగా ప్రధానోపాధ్యాయులు వి .మురళీకృష్ణ ఎస్ఎంసి చైర్మన్ శ్రీమతి మారే సుబ్బాయమ్మ డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా ఉండి భారతదేశంలో గుర్తింపు పొందిన రాజకీయవేత్తగా ఉపరాష్ట్రపతి గా చేశారని ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారని ఆయన అత్యున్నత భారతరత్న పురస్కారాన్ని అందుకున్నారు. చైర్మన్ మాట్లాడుతూ గురువులు దైవంతో సమానమని గురువులు చెప్పిన మాట వింటే విద్యార్థులు భవిష్యత్తులో అభివృద్ధి చెందుతారు అన్నారు ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలేని కూడా గుర్తు చేసుకోవాలని మహిళలకు విద్య అవసరమని విద్యను అందించిన ఘనత సావిత్రిబాయి పూలేదని భారతదేశంలో ప్రథమ మహిళ ఉపాధ్యాయురాలుగా ఆమె నిలిచారు అన్నారు.అనంతరం ప్రతి ఉపాధ్యాయునికి సాలువా, పూలమొక్కలు ఇచ్చి భారతీయ జనతా పార్టీ కార్యకర్త మద్దెంశెట్టి శ్రీను సత్కరించడం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదాభివందనాలు చేసి వారి ఆశీర్వాదం తీసుకుంటూ ఉపాధ్యాయులకి పండ్లు పువ్వులు తో అభినందనలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , భారతీయ జనతా పార్టీ నాయకులు పాలూరి.సత్యానందరావు, కంకటాల నాని, పాఠశాల సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు అని పాఠశాల చైర్మన్ మారే సుబ్బాయమ్మ తెలియజేశారు.

# రోటరీ యోజనోత్సవాలు ఘనంగా ప్రారంభం





**అమలాపురం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** యువతలోని ప్రతిభను వెలికితీసి, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు సేవా భావాన్ని ప్రోత్సహించేందుకు రోటరీ క్లబ్ అమలాపురం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోజనోత్సవాలు ఆదివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం, ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి రోటరీ గవర్నర్‌గా ఎన్నికైన 2028–29 సంవత్సరానికి చెందిన డాక్టర్ సంజయ్ ముచ్చర్ల ముఖ్య అతిథిగా హాజరుకాగా, రోటరీ క్లబ్ అమలాపురం అధ్యక్షులు ఆర్.డి.ఎస్. ప్రసాద్ అధ్యక్షత వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శాస్త్రీయ నృత్యం, సెమీ శాస్త్రీయ నృత్యం, శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం జ్యోతి ప్రజ్వలన, రోటరీ గీతికతో సభా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రోటరీ క్లబ్‌లో నూతన సభ్యులను చేర్చుకుని, వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యారంగంలో విశిష్ట సేవలందిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జెడ్.పీ. ఉన్నత పాఠశాల, జి.పెదపూడికి చెందిన పాఠశాల సహాయకుడు అడపా వీరవెంకట రమణ, అమలాపురం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పాఠశాల సహాయకురాలు మామిడిశెట్టి శాంతకుమారి, ఎన్.కొత్తపల్లిలోని మండల పరిషత్ నమూనా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెచ్చెట్టి నరేష్ బాబు, ఉడుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నెల్లి సంపత రావు, గూడపల్లి పరిధిలోని కొప్పివారి మెరక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ పాఠశాల సహాయకురాలు మంతెన లక్ష్మీ గీతా కుమారిని సన్మానించారు. ప్రతి సన్మాన గ్రహీతను రోటరీ సభ్యులు సభకు పరిచయం చేసి అనంతరం ఘనంగా సత్కరించారు. సన్మానం పొందిన ఉపాధ్యాయులు తమ అనుభవాలను, అభిప్రాయాలను సభికులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను వక్తలు కొనియాడారు. ముఖ్య అతిథి డాక్టర్ సంజయ్ ముచ్చర్ల మాట్లాడుతూ యువతలోని ప్రతిభను వెలికితీయడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, సేవా భావాన్ని ప్రోత్సహించడం రోటరీ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అన్నారు. యువతకు వివిధ రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు యోజనోత్సవాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అధ్యక్షులు ఆర్.డి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ విద్య, విజ్ఞానం, సాంకేతికత, కళలు, క్రీడలు, నాయకత్వం, సామాజిక బాధ్యత వంటి వివిధ రంగాల్లో యువత ప్రతిభను ప్రోత్సహించడమే యోజనోత్సవాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల ఆత్మీయుల ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మానం నిర్వహించారు. అనంతరం వందన సమర్పణ, జాతీయ గీతాలాపనతో సభా కార్యక్రమాలు ముగిశాయి. కార్యక్రమానికి హాజరైన అతిథులు, రోటరీ సభ్యులు, ఉపాధ్యాయులు, ఆహ్వానితులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన రోటరీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కళాకారులు, వాలంటీర్లు, నిర్వాహకులకు అధ్యక్షులు ఆర్.డి.ఎస్. ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

**ద్రాక్షారామలో ఘనంగా**

# బీజేపీ సేవా సంకల్ప్ అభియాన్ కార్యశాల



**రామచంద్రపురం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సెప్టెంబర్ 17 నుంచి నెల రోజుల పాటు నిర్వహించనున్న సేవా సంకల్ప్ అభియాన్ సన్నాహక సమావేశం జరిగింది. జిల్లా బీజేపీ అధ్యక్షులు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాలతి రాణి, జిల్లా ఇంచార్జ్ కారంకి శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మొదలై ప్రధానమంత్రి స్థాయి వరకు మోదీ సాగించిన ప్రయాణం దేశానికే స్ఫూర్తిదాయకమని వక్తలు తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు జరిగే ఈ సేవా కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి ప్రతి బూత్ లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమం, ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ లక్ష్యాలను ఇంటింటికీ చేరవేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమా, కర్రి చిట్టిబాబు, టి. రామిరెడ్డి, బేబీ రాణి, నాగిరెడ్డి సతీష్ రావు, సలాది వీరబాబు, పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో పలు కీలక తీర్మానాలు చేశారు.

**ద్రాక్షారామలో గణేష్ ఉత్సవాల నిర్వహణకు**

# అనుమతులు తప్పనిసరి : ఎస్ఐ లక్ష్మణ్



**ద్రాక్షారామ, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 14న జరగనున్న వినాయక చవితి పండుగ సందర్భంగా గణేష్ పందిళ్ళు మరియు మండపాల ఏర్పాటుకు సంబంధించి పోలీసులు మార్గదర్శకాలు విడుదల చేశారు. ఉత్సవాల నిర్వహణకు ఆసక్తి గల వారు తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారా అనుమతులు పొందాలని ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. మండపాల ఏర్పాటుకు ఎలాంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించే వారు ముందుగా కమిటీగా ఏర్పడి ప్రభుత్వ సింగిల్ విండో విధానం ద్వారా https://ganeshutsav.net వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలి. వెబ్‌సైట్‌లోకి వెళ్లి 'న్యూ అప్లికేషన్'పై క్లిక్ చేసి, దరఖాస్తుదారుల ఫోన్ నంబర్ నమోదు చేస్తే వచ్చే ఓటీపీ ద్వారా నంబర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి. దరఖాస్తు ఫారంలో కమిటీ పేరు, నిర్దేశిత స్థలం, పోలీసు స్టేషన్ పరిధి, విగ్రహం మరియు మండపం ఎత్తు వివరాలతో పాటు ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నంబర్లు, నిమర్జనం జరిగే తేదీ, సమయం మరియు వాహనాల వివరాలను పొందుపరచాలి. దరఖాస్తును పరిశీలించిన అనంతరం పోలీసు అధికారులు ఉత్సవ ప్రాంతాన్ని తనిఖీ చేసి అనుమతులు మంజూరు చేస్తారు. దరఖాస్తుదారులు https://ganeshutsav.net/applicationStatus ద్వారా నిరభ్యంతర పత్రం మరియు క్యూఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. డౌన్‌లోడ్ చేసుకున్న ఎన్.ఓ.సి. మరియు క్యూఆర్ కోడ్‌ను ప్రింట్ తీసి, లామినేషన్ చేసి మండపంలో తనిఖీ అధికారులకు అందుబాటులో ఉంచాలి. గణేష్ పందిళ్లు మరియు మండపాల వద్ద విగ్రహాలను నిమజ్జనం చేసే వరకు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఎలాంటి అల్లర్లు లేదా ఘర్షణలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించుకోవడానికి ప్రజలందరూ పోలీసు వారికి పూర్తిగా సహకరించాలని ఎస్ఐ కోరారు.

# ఆక్రమణల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి

**రోడ్లు, డ్రెయిన్లు, ఫుట్ పాత్‌లపైన ఆక్రమణలను పూర్తిగా నిర్మూలించాలి : కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలో ఆక్రమణల తొలగింపునకు పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నెలాఖరులోగా నగరంలోని రోడ్లు, ఫుట్ పాత్ లు, డ్రెయిన్లపైన ఉన్న అనధికార నిర్మాణాలు, ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఆదేశించారు. ప్రజా భద్రత, ప్రణాళికాబద్ధమైన నగర అభివృద్ధి దృష్ట్యా అమలులో ఉన్నటువంటి నిబంధనల ప్రకారం ఈ చర్యలు చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నగర పరిధిలో నిబంధనల మేరకు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చని.. రహదారులు, డ్రెయిన్లు, ఫుట్ పాత్ లపై కంటైనర్లు, షెడ్లు, ఇతర శాశ్వత నిర్మాణాలను ఏర్పాటు చేయడం అనుమతించబడదని స్పష్టం చేశారు. కనుక ఆక్రమణదారులకు చట్టపరమైన నోటీసులు జారీచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆక్రమణల తొలగింపునకు ముందు-తర్వాత ఫోటోలు తప్పనిసరిగా రికార్డు చేసుకోవాలన్నారు. కాలువల్లో ఎక్కడా వాటర్ లైన్లు, విద్యుత్ స్థంభాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణలను తొలగిస్తే తప్ప జంక్షన్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ సాధ్యపడదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కనుక ఆక్రమణల తొలగింపులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. అప్పుడే నగరంలో వాహనాల రాకపోకలు మరింత సులభంగా మారతాయన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఉండేలా చూడాలన్నారు. ఆస్పత్రులకు పార్కింగ్ ప్రదేశం తప్పనిసరిగా ఉండాలని.. ఆంబులెన్స్ లు, పేషంట్ల తాలుకా వాహనాలను సెల్లార్ లోనే పార్కింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. అలా కాదని రహదారుల వెంబడి పార్కింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. రోడ్లపైకి వచ్చిన భవనాల ర్యాంపులు సైతం తొలగించాలన్నారు. అదేవిధంగా అనధికారిక, అనుమతి లేని ఫ్లెక్సీలను మరియు బ్యానర్లపై కఠినంగా వ్యవహరించాలని.. నగర అందాన్ని దెబ్బతీసేలా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### లోక కళ్యాణం కోసమే

# మహాన్యాస మహా రుద్రాభిషేకం

## ఆలయ అర్చకుడు కోటమర్తి శ్రీరామచంద్రమూర్తి





**కోటనందూరు, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** లోక కళ్యాణం కోసమే మహాన్యాస మహా రుద్రాభిషేకం లక్ష బిల్వార్చన పూజలు చేసినట్లు అర్చకుడు కోటమర్తి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. కాకినాడ జిల్లా, కోటనందూరు మండలం, తిమ్మరాజుపేట గ్రామంలో ఉన్న శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం ఆరుద్ర నక్షత్రం దశమి సందర్భాన్ని పురస్కరించుకొని వేద పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన,లక్ష కుంకుమార్చన, నీరాజనం, వేద స్వస్తి తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ ఈ ఆలయంలో గత రెండు సంవత్సరముల నుండి ఇటువంటి మహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా యధావిధిగా మహా రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు జరిపించినట్లు తెలియజేశారు. ఈ పూజలు లోక కళ్యాణం కొరకు, వర్షాలు సకాలంలో కురిసి రైతులు పాడి పంటలు, సుఖసంతోషాలు, ఆయుష్ ఆరోగ్యాలతో ఉండాలని తెలియజేశారు. ఈ ఆలయంలో మరెన్నో కార్యక్రమాలు నిత్య కైంకర్యాలు జరిపించడానికి దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు అని తెలియజేశారు .అనంతరం అంబికా ఫ్యాక్టరీ యజమానులు ముత్తు కుమరణ్, మున్నులూరి ఆనంద గుప్తా, పత్తి రాధాకృష్ణ దంపతులను మరియు భక్తులకు వేద ఆశీర్వాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్తుకుమరణ్, మున్నులూరి ఆనందగుప్త,పత్తి రాధాకృష్ణ, బర్ల వెంకి నాయుడు, బర్ల నరసింహమూర్తి, కొల్లు బాబ్జి, కొల్లు చందర్రావు, చింతల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా స్పందన తెలియజేయండి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్






**కోటనందూరు, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)పై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపు నిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మరింత పారదర్శకత జవాబుదారీతనం దిశగాను, నిరంతర అభిప్రాయ సేకరణ చేసి పౌరుల సంతృప్తిని మెరుగు పరచడం, వ్యవస్థ ను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా,మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శించాలనినిర్ణయించడం జరిగిందనన్నారు. జిల్లా,మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాల ప్రవేశ,నిష్క్రమణ ప్రాంతాలలో క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. పౌరులుపి.జి.ఆర్.ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని సమర్పించవచ్చునన్నారు.క్యూ.ఆర్ కోడ్ వలన ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ https://pgrs.ap.gov.in/Home/QRGrievance Feedback కు చేరుతుందని అన్నారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించు కోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారంజిల్లా కలెక్టర్ కార్యాలయం లోను,మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కోరారు.

# 90 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రదానం

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 90 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను శనివారం రాజమహేం ద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఘనంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం, ఆయన ఉపాధ్యాయుడిగా సేవలందించిన రాజమహేంద్రవరం గడ్డపై గురుపూజోత్సవం నిర్వహించడం ఎంతో విశిష్టమైన విషయమన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, సంస్కారం, భాష, క్రమశిక్షణ వంటి అంశాలకు ఉపాధ్యాయుల బోధనే పునాది అని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందన్న భావనను నిజం చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, యూనిఫాంలు, విద్యార్థుల కిట్లు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు బాలికలకు మెరుగైన మరుగుదొడ్డి సౌకర్యాలు కల్పించడం ద్వారా డ్రాపౌట్స్ తగ్గించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.సీఎస్ఆర్ భాగస్వామ్యంతో కూడా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, మరింత మెరుగైన విద్యను అందించే స్థాయికి ఎదుగుతాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, సమాజంలోని అన్ని వర్గాలు సమష్టిగా భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రంలో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందించారు. తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్కరణలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం పూర్తిస్థాయిలో అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గురుపూజోత్సవం సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పించి తమ జీవితాలకు మార్గనిర్దేశం చేసిన గురువులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజాన్ని జాగృతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, భావితరాలకు దిశ, దశను నిర్దేశించగల శక్తి ఉపాధ్యాయులకే ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, నమ్మకం పెంపొందించడంతో పాటు వారి ఆలోచనా విధానంలో, ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకురావడానికి ఉపాధ్యాయులు ప్రేరణగా నిలవాలని సూచించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా వినూత్నమైన, సృజనాత్మక బోధనా పద్ధతులను అవలంబించి పాఠాలను ఆసక్తికరంగా బోధించడం ద్వారా విద్యార్థుల్లో దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పరచుకునే సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ అంతర్లీనంగా ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తే వారు అద్భుతమైన విజయాలు సాధించగలరని తెలిపారు.విద్యార్థులకు విద్య ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా విద్యార్థులను సాంస్కృతిక, క్రీడా, సృజనాత్మక రంగాల్లోనూ ప్రోత్సహించి వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానాలకు ఎదిగేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు.సభాధ్యక్షులు, రాజమహేంద్రవరం సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.డీఎస్సీ ద్వారా పారదర్శకంగా వేలాది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని, ఇచ్చిన హామీ మేరకు వచ్చే ఏడాది కూడా డీఎస్సీ నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు ఎదుర్కొన్న కష్టాలను, ముఖ్యంగా ప్రసవానంతరం కూడా పరీక్షలకు హాజరై విజయం సాధించిన మహిళల పట్టుదలను ప్రస్తావిస్తూ వారి సంకల్పాన్ని అభినందించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేందుకు కష్టపడి ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన అభ్యర్థుల విజయాలు స్ఫూర్తిదాయకమన్నారు.ఉపాధ్యాయ నియామకాలు, అభ్యర్థుల కష్టాన్ని రాజకీయ కోణంలో విమర్శించడం సముచితం కాదని, ఉద్యోగాలు పొందిన యువతలో ఆత్మవిశ్వాసం పెంచేలా అన్ని వర్గాలు బాధ్యతాయుతమైన వ్యాఖ్యలు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు యువతకు రాష్ట్రంలోనే మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేలా రాష్ట్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రాజమహేంద్రవరం నగరంలోని మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి గత రెండేళ్లలో సుమారు రూ.1.20 కోట్ల సీఎస్ఆర్ నిధులు సమీకరించినట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో మోరంపూడి పాఠశాలకు 10వ తరగతి వరకు అనుమతులు సాధించి, 9, 10 తరగతుల విద్యార్థుల కోసం నూతన భవనాన్ని నిర్మించినట్లు వివరించారు. మోరంపూడి శ్యామలాంబ పాఠశాలలో సుమారు 600 గజాల స్థలంలో రూ.50 లక్షలతో పాఠశాల భవనం, లిఫ్ట్ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు.నాగరాజ మున్సిపల్ పాఠశాలలో 'అడ్మిషన్లు పూర్తయ్యాయి' అనే స్థాయికి చేరుకోవడం సంతోషకరమని, నగరంలోని అన్ని మున్సిపల్ పాఠశాలల్లో ఇదే విధమైన పురోగతి సాధించాలని ఆకాంక్షించారు.రాజమహేంద్రవరం సిటీకి త్వరలోనే జూనియర్ కళాశాల ఏర్పాటుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చించినట్లు వెల్లడించారు. విద్యార్థుల యూనిఫాంలు, బెల్టులపై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరును చేర్చడం, మధ్యాహ్న భోజన పథకానికి 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం'గా నామకరణం చేయడం ఉపాధ్యాయులు, విద్యార్థుల పట్ల ప్రభుత్వ గౌరవానికి నిదర్శనమన్నారు. 'బడి పిలుస్తోంది' కార్యక్రమం ద్వారా విద్యాశాఖ అధికారులు, కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులతో కలిసి మున్సిపల్ పాఠశాలల్లో అడ్మిషన్ల పెంపునకు విస్తృత ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు.రాజకీయ నాయకులకు పదవులు మారినా ఉపాధ్యాయులకు 'మాజీ' అనే పదం ఉండదని, సమాజంలో వారికి ఎల్లప్పుడూ గౌరవప్రదమైన, పవిత్రమైన స్థానం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని, బోధన కేవలం వృత్తి కాదని, అది ఒక గొప్ప బాధ్యత అని అన్నారు. భారతీయ సంస్కృతిలో గురువుకు 'ఆచార్య దేవోభవ' అంటూ వేల సంవత్సరాలుగా ప్రత్యేక స్థానం కల్పించామని గుర్తుచేశారు. ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఎంత సమాచారం అందుబాటులోకి వచ్చినా, విద్యార్థి మానసిక స్థితిని అర్థం చేసుకుని ఆప్యాయంగా మార్గనిర్దేశం చేసే ఉపాధ్యాయుడి స్థానాన్ని ఏ సాంకేతికతా భర్తీ చేయలేదని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని కోరారు.అనపర్తి నియోజకవర్గం, పెదపూడి మండలాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు. కుతుకులూరు ఉపాధ్యాయుడు ఎన్.వి. రాఘవరావు సింగపూర్‌లో అంతర్జాతీయ శిక్షణకు ఎంపిక కావడం, రంగంపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వి. రమ్యసుధ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం అభినందనీయమని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువుల సేవలను, వారి ప్రాముఖ్యతను స్మరించుకుని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు.ఉపాధ్యాయులు కేవలం పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలను బోధించేవారు మాత్రమే కాకుండా సమాజం, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక శక్తి అని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో జిజ్ఞాస, ప్రశ్నించే తత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారిలో దాగి ఉన్న పూర్తి ప్రతిభను వెలికితీసేలా కృషి చేస్తారని అన్నారు. ప్రతి విద్యార్థి తన సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ వై. మేఘా స్వరూప్, సహాయ కలెక్టర్ ఆదిత్య శర్మ, క్రైమ్ డీఎస్పీ సుభాష్, జిల్లా పాఠశాల విద్యాధికారి కె. వాసుదేవరావు, పేరెంట్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి, సమగ్ర శిక్ష పీడీ ఎస్ .సుభాషిణి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యాపురంలో ముగిసిన జన్మాష్టమి ఉత్సవాలు

## భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్యాపురం శ్రీ కృష్ణ చైతన్య మిషన్ అండ్ ఆశ్రమం శ్రీ గౌరాంగ రాధాకృష్ణ మందిరంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ కృష్ణ జన్మాష్టమి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద శనివారం పెద్దఎత్తున నందోత్సవం పేరుతో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజు భక్తులు తరలివచ్చి శ్రీ కృష్ణ స్వామి వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారని ఆశ్రమ ఇన్‌చార్జ్ హరిదాస్ బ్రహ్మచారి తెలిపారు. శనివారం సాయంత్రం భజన, హరినామ సంకీర్తన అనంతరం చిన్నారులకు బాలకృష్ణ వేణధారణ పోటీలు నిర్వహించారు. చిన్నారులు పలు రకాల వేషధారణ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముట్లూరు పార్వతి, పిచ్చిక రాంబాబు, పివీఎస్ కృష్ణారావు, ఎన్ వి కుమార్ ఈ కార్యక్రమానికి జడ్జిలుగా వ్యవహరించారు. అనంతరం ఆలయం వద్ద ఉట్టికొట్టే ఉత్సవాన్ని నిర్వహించారు. వేషధారణ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానోత్సవం ఘనంగా జరిగంది. శ్రీ కృష్ణ చైతన్య మిషన్ అండ్ ఆశ్రమం వ్యవస్థాపక ఆచార్యులు శ్రీల భక్తి వైభవ పూరీ గోస్వామి వారి ఆశీస్సులతో భక్తి కంకణ బన మహారాజ్ శ్రీ కృష్ణ ఆవిర్భావ విశిష్టతపై ఉపన్యాసం ఇచ్చారు. వేద పండితులచే వేద పఠనం, శ్రీ బాల గోపాలునికి 108 కలశాలతో పంచామృతాభిషేకం, ఫల పుష్పాతో అభిషేకం నిర్వహించారు. 56 వెండి పాత్రలతో 56 రకాల పిండి వంటలతో మహారాజభోగ నివేదన అనంతరం 108 దీపాలతో శ్రీ రాధాకృష్ణ, గోదావరి మాతకు మహా హారతి తరువాత తీర్థ, ప్రసాద వితరణ చేసినట్టు తెలిపారు.



స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి

# పార్టీని మరింత బలోపేతం చేయాలి

## రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



**సీతానగరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపు నిచ్చారు. ఆదివారం సీతా నగరం మండలం నాగంపల్లి అచ్చయ్యపాలెం గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ గ్రామ కమి టీలు, అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామస్థాయిలో పార్టీ నాయకులు సమన్వయంతో పని చేయాలని రాజా సూచించారు. రిజర్వేషన్లకు అనుగుణంగా సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేసు కోవాలని, గ్రామస్థాయిలో పటిష్టమైన సంస్థాగత నిర్మా ణం ఉంటేనే ఎన్నికలను సమర్థంగా ఎదుర్కోగలమని అన్నారు.ప్రతి గ్రామంలో అన్ని అనుబంధ విభాగాల కమిటీలను ఏర్పాటు చేస్తూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తు న్నామని తెలిపారు. రాను న్న ఎన్నికల్లో ప్రతి గ్రామ పంచాయతీతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పిలు పునిచ్చారు.గ్రామస్థాయిలో పార్టీకి అండగా నిలిచిన ప్రతి వర్గానికి, ప్రతి కార్యకర్తకు తగిన ప్రాధాన్యత కల్పించేలా కమిటీలను రూపొం దిస్తున్నామని చెప్పారు. ప్రజా సమస్యలే పార్టీ కార్యకర్తల ప్రధాన ఎజెండాగా ఉండాలని సూచిం చారు. గ్రామాల్లో ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం ప్రజల పక్షాన పోరాడాలని అన్నా రు.వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృ తంగా తీసుకెళ్లడంతో పాటు, నాయ కులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటు లో ఉండా లని సూచించారు. కూటమి ప్రభు త్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలను ఎప్పటికప్పు డు ప్రజల దృష్టికి తీసు కెళ్లాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచుతూ క్షేత్ర స్థాయిలో పార్టీ సంస్థాగత బలాన్ని పెంపొందిం చుకోవాలని, ఎన్నికలకు ఇప్పటి నుంచే పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# గోకవరంలో గణేష్ ఉత్సవాలకు యువత శ్రీకారం

పందిరి రాట వేసి ఏర్పాట్లకు శుభారంభం..
కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఉత్సవాల నిర్వహణకు నిర్ణయం



**గోకవరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** రాబోయే వినాయక ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గోకవరం గ్రామ యువత సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక డ్రైవర్స్ కాలనీలో నమో చిట్టి వినాయక యూత్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. పందిరి రాట వేసి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వినాయక ఉత్సవాల నిర్వహణకు విధించిన నిబంధనలు, మార్గదర్శకాలకు పూర్తిస్థాయిలో అనుగుణంగా కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, గ్రామ ప్రజలు అందరూ గణేష్ ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. నమో చిట్టి వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ ఉత్సవాలను గతంలో కంటే మరింత వైభవంగా నిర్వహించేందుకు యువత సమిష్టిగా కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు దోసపాటి సుబ్బారావు, వైకాపా జగ్గంపేట అసెంబ్లీ ముస్లిం మైనారిటీ విభాగం అధ్యక్షులు షేక్ నాగూర్ వల్లి బాబా, జనసేన యువజన నాయకులు మహిపాల పాండురాజు, నమో చిట్టి వినాయక యూత్ సభ్యులు, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మీడియా మిత్రులకు అండగా ఉంటా..

## పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తాం - ఘనంగా జెడిఆర్ఎఫ్ తూర్పుగోదావరి జిల్లా మహాసభ





**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** మీడియా మిత్రులకు అండగా ఉంటామని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. ఆదివారం రాజమండ్రి పోలీస్ కన్వెన్షన్ హాల్లో జెడిఆర్ఎఫ్ తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో (జర్నలిస్ట్ డెమోక్రటిక్ రైట్స్ ఫోరం ) జెడిఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేడా శ్రీనివాస్ అధ్యక్షతన మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీడియా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కార్యక్రమాలు ప్రజలకు చేరాలంటే మీడియా మిత్రుల సహకారం తప్పనిసరి అని అన్నారు. మీడియా హక్కులు కాపాడడానికి సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ సమాజంలో అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలంటే జర్నలిస్టులు గొంతు ఎత్తి సమస్యలపై పోరాటం చేయడం వల్లే సాధ్యం అవుతుంది అని అన్నారు. వాస్తవాలను జర్నలిస్టులు బయట పెట్టడం వల్ల సమాజంలో మార్పు తీసుకు వస్తున్నారని కొనియాడారు. జర్నలిస్టు లేకపోతే సమాజంలో అస్తవ్యస్తంగా తయారవుతుందని అన్నారు. బెటర్ సొసైటీ నెలకొనాలంటే మీడియా రంగం పాత్ర ప్రముఖమని పేర్కొన్నారు. తను ఎంపీగా రాజమండ్రిలో చేసిన పనులు వల్లే సుందర నగరంగా తీర్చిదిదడం జరిగిందని అన్నారు. జెడిఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి , రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టులకు భరోసా కల్పించేందుకు జీడిఆర్ఎఫ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో జెడిఆర్ఎఫ్ బోలోపేతానికి జిల్లా గౌరవ అధ్యక్షులు మారంపూడి సోమరాజు, దివంగత జెడిఆర్ఎఫ్ కార్యదర్శి విలేకరి కుడెల్లి రత్న కిషోర్ కృషి చేశారని అన్నారు. రత్న కిషోర్ మృతి కు తీరని లోటు అని అన్నారు. జెడిఆర్ఎఫ్ జాతీయ అధ్యక్షులు పూల తోట కృష్ణ సారధ్యం లో జర్నలిస్టుల సమస్యలపై జాతీయస్థాయిలో ఉద్యమాలు చేస్తున్నట్లు తెలిపారు. జిడిఆర్ఎఫ్ విలేకరులకు అండగా ఉంటుందని ఏ సమస్య వచ్చినా , కష్టం వచ్చినా విలేకరుల పక్షాన ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పెద్దగా సంపాదన లేకపోయినప్పటికీ గౌరవప్రదమైన వృత్తిగా భావించి విలేకరుల వృత్తిలో కొనసాగుతున్నారని అన్నారు. అక్రమాలు అన్యాయాలపై వార్తలు రాసి విలేకరులపై రాజకీయ నాయకులు , పోలీసులు అక్రమ కేసులు పెట్టి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విలేకరులపై అక్రమ కేసులు పెట్టిన, దాడులు జరిపిన జెడిఆర్ఎఫ్ విలేకరులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

**సీనియర్ జర్నలిస్టులకు ఘన సన్మానం :**

ఈ సందర్భంగా జె డి ఆర్ ఎఫ్ ఆధ్వర్యంలో 20 సంవత్సరాలకు పైగా పత్రిక రంగంలో కొనసాగుతున్న రాఘవరావు, లింకన్ , వరద నాగేశ్వరరావు, రాజగోపాల్, తలుపుల రావు, కృపానందం, మారంపూడి సోమరాజు, తదితర సీనియర్ జర్నలిస్టులకు ఘనంగా సన్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, నగర అధ్యక్షులు బాలేపల్లి మురళి,జర్నలిస్ట్ డెమోక్రటిక్ రైట్స్ ఫోరం గౌరవ అధ్యక్షులు మారంపూడి సోమరాజు, జిల్లా అధ్యక్షులు గాదె గిరీష్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి సింగంశెట్టి సూర్య రాఘవేంద్ర, కోశాధికారి పిచ్చుక మహేష్, ఉపాధ్యక్షులు గొర్రెల రాజు, ఎస్.కె మదీనా భాష, కార్యదర్శి ఉమ్మెత్తల శ్రీనివాస్, ఉప కార్యదర్శి లు కారాను శివరామకృష్ణ, రెడ్డి సత్య సుబ్రహ్మణ్యం, ఎగ్జిక్యూటివ్ నెంబర్లు కోడి తాతారావు, యండమూరి శ్రీనివాస్, యనగల వెంకటేష్, చల్ల విజయ్ (బాలు), మహమ్మద్ నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకులు మేడిశెట్టికి

# పెందుర్తి పదివేలు ఆర్థిక సహాయం

పెందుర్తి కుటుంబానికి కృతజ్ఞతలు



**కోరుకొండ, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని పశ్చిమ గోనగూడెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మేడిశెట్టి సూరిబాబు గత కొన్నాళ్లుగా అస్వస్థతకు గురయ్యారు. గత వైసిపి ప్రభుత్వం మేడిశెట్టి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న, నేటి ఆయనకు ప్రభుత్వం నుండి ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదు. ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టూర్ ప్రోగ్రాం కన్వీనర్ రాజానగరం మాజీ శాసనసభ్యులు పెందుర్తి వెంకటేష్ తనయుడు తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ మేడిశెట్టి సూరిబాబును పరామర్శించి, కుటుంబ సభ్యులతో ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. అనంతరం మేడిశెట్టికి పెందుర్తి అభిరామ్ 10వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి, తామంతా అండగా ఉంటామని ఆరోగ్యం పరిస్థితి త్వరలోనే మెరుగుపడుతుందని ధైర్యంగా ఉండాలని మేడిశెట్టి కుటుంబానికి భరోసా కల్పించారు. అనంతరం మేడిశెట్టి కుటుంబసభ్యులు పెందుర్తి కుటుంబానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కొయ్యే సామ్యూల్, మేడిశెట్టి శ్రీను, బత్తిన సూరిబాబు, పిల్లి కోటి, మట్టాడి హరి, మేడిశెట్టి శ్యాంబాబు, వనుం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

## డిజిటల్ లేబర్ చౌక్ యాప్‌ను ప్రతి కార్మికుడు ఇన్‌స్టాల్ చేసుకోవాలి



**రాయవరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సేవలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్. సత్యవేణి సూచించారు. కార్మికులు తమ సభ్యత్వాన్ని సకాలంలో పునరుద్ధరించుకోవడం ద్వారా ప్రభుత్వ పరంగా అందే వివిధ ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. కొత్తగా భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేసుకోవాలనుకునే వారు మనమిత్ర యాప్ ద్వారా లేదా లేబర్ ఆఫీస్ ఆన్‌లైన్ సేవల ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే ఇప్పటికే సభ్యత్వం కలిగిన వారు తమ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడం ద్వారా సంక్షేమ పథకాల ప్రయోజనాలను కొనసాగించుకోవచ్చన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలను మరింత సులభతరం చేసేందుకు అందుబాటులోకి తీసుకువచ్చిన 'డిజిటల్ లేబర్ చౌక్' యాప్‌ను ప్రతి కార్మికుడు తన మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఆమె కోరారు. యాప్ ద్వారా కార్మికుల నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన సమాచారాన్ని డిజిటల్ విధానంలో పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్మికులు తమ హక్కులు, సంక్షేమ పథకాలు, సభ్యత్వ నమోదు, పునరుద్ధరణ వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలని ఆర్. సత్యవేణి సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు మండల కేంద్రమైన రాయవరంలో ఉన్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు.

ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం

# ఐదో రోజు నల్లజెండాలతో నిరసన



**సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉద్యోగుల సమస్యలు, డిమాండ్ల సాధన కోసం ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఐదో రోజు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఉద్యోగులు నల్లజెండాలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా "సీఎం సార్.. మా డబ్బులు మాకు ఇవ్వండి" అంటూ నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి తూర్పుగోదావరి జిల్లా చైర్‌పర్సన్లు, వివిధ శాఖల ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు డీఏలను ప్రకటించడం, ఉద్యోగులకు ఇచ్చిన ఇతర హామీల విషయంలో సానుకూలంగా స్పందించడం పట్ల ఉద్యోగ సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. అయితే తమ నిరసన కార్యక్రమాలు ఉద్యోగులకు ఇంటరిమ్ రిలీఫ్ ప్రకటించాలనే ప్రధాన డిమాండ్ సాధన కోసమే కొనసాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసే ముందే ఉద్యోగులకు ఇంటరిమ్ రిలీఫ్ ప్రకటించాలని వారు కోరారు. ఈ ప్రధాన డిమాండ్‌పై ప్రభుత్వం సానుకూలంగా స్పందించే వరకు దశలవారీగా నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు.

# 8న మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా

## నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు : జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్.శిరీష

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 6, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో సెప్టెంబర్ 8వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ జాబ్ మేళాలో ప్రముఖ ఆపిల్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, టీమ్‌లీస్, సాయి మోటార్స్ ప్లాజా తదితర సంస్థల్లో పలు ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు.

**అభ్యర్థుల అర్హతలు:** వయస్సు: 19 నుంచి 35 సంవత్సరాల లోపు,

**విద్యార్హత:** పదో తరగతి, ఇంటర్మీడి యట్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ.,ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు.సంబంధిత రంగంలో అనుభవం ఉన్నవారు లేదా ఉద్యోగం పట్ల ఆసక్తి ఉన్నవారు,వివిధ సంస్థల్లో అందుబాటులో ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.ఆసక్తి గల అభ్యర్థులు employment.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో ముందుగా రిజిస్టర్ చేసుకుని, రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు నేరుగా హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9398318601 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష కోరారు.






### హీరోగా ఎంట్రీ ఇవ్వనున్న

# నందమూరి మోక్షజ్ఞ తేజ..



నందమూరి అభిమానులు ఎన్నో ఏళ్లుగా వేయి కళ్లతో ఎదురుచూస్తున్న శుభ తరుణం రానే వచ్చింది. నటసింహం నందమూరి బాలకృష్ణ తనయుడు, నందమూరి మోక్షజ్ఞ తేజ వెండితెర అరంగేట్రానికి ముహూర్తం ఖరారైంది. టాలీవుడ్ వర్గాల్లో గత కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, మోక్షజ్ఞ తన తొలి చిత్రంతో వెండితెరకు పరిచయం కాబోతున్నారు. గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞ తేజ తెలుగు చిత్రసీమలో తన తొలి అడుగు వేయడానికి సిద్ధమయ్యారు. మోక్షజ్ఞ పుట్టినరోజు సందర్భంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న డెబ్యూ సినిమాను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. నందమూరి కుటుంబానికి, అభిమానులకు ఇది మరో గొప్ప అధ్యాయానికి నాంది పలకనుంది. తన డెబ్యూ కోసం సరైన కథను ఎంచుకునేందుకు మోక్షజ్ఞ కావాల్సిన సమయం తీసుకున్నారు. పలు కథలను విన్న తర్వాత తనకు నచ్చిన కథకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి ప్రతిష్టాత్మక సోషియో ఫాంటసీ చిత్రం ‘విశ్వంభర’ చేస్తున్న దర్శకుడు వశిష్ఠ ఈ కథను సిద్ధం చేశారు. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందులోనూ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించనుండటంతో సినిమాపై మరింత ఆసక్తి నెలకొంది. చిత్ర బృందం బాలకృష్ణ, మోక్షజ్ఞలను కలుసుకుని, యంగ్ లయన్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కొన్ని స్టిల్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ స్టిల్స్ మోక్షజ్ఞ స్టైలిష్‌గా, ఫిట్‌గా, చాలా హ్యాండ్సమ్ కనిపించడం అందరినీ ఆకట్టుకుంది. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు మోక్షజ్ఞ ఇప్పటికే ఇంటెన్స్ గా ప్రిపేర్ అయ్యారు. కమర్షియల్ హీరోకు అన్ని అంశాల్లో శిక్షణ తీసుకుంటూ ఫిజికాలిటీ, పెర్ఫార్మెన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మోక్షజ్ఞ తేజ హీరోగా ఎంట్రీ ఇస్తుండటం, వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండటం, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండటంతో ఈ కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మిగతా ఇతర నటీనటులు, టెక్నికల్ టీం వివరాలని మేకర్స్ వెల్లడించనున్నారు.

# ఆడపిల్లలంటే ఆట వస్తువులు కాదు..

### అలా చూపిస్తే ఒప్పుకోను..!
### కాయదు లోహర్ షాకింగ్ కామెంట్స్

కాయదు లోహర్ మోడల్ గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ గా మారింది. ఈ బ్యూటీ 2000 ఏప్రిల్ 11న అస్సాంలోని తేజ్‌పూర్‌లో జన్మించింది. ప్రస్తుతం పూణేలో సెటిల్ అయ్యింది కాయదు. తన కెరీర్‌ను మోడల్‌గా ప్రారంభించిన కాయదు, 2021లో పూణే ఫ్రెష్ ఫేస్ కాంపిటీషన్‌లో విజేతగా నిలిచింది. అదే సంవత్సరం కన్నడ చిత్రం “ముగిల్‌పేట”తో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ప్రదీప్ రంగనాథన్ నటించిన ‘డ్రాగన్’ చిత్రంతో హీరోయిన్ కయాదు లోహర్ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంతకు ముందుకు ఈ అమ్మడు తెలుగులో అల్లూరి అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా పెద్దగా ఆకట్టుకుకోలేదు. ఇక ఈ చిన్నది ఫంకీ సినిమాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ను ఆకట్టుకుంది. కానీ ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం ఆమె తమిళం, తెలుగు చిత్రసీమలలో చాలా బిజీగా ఉంది. సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మ చాలా యాక్టివ్ గా ఉంటుంది. మరోవైపు తెలుగులోనూ బ్యాక్ టూ బ్యాక్ అవకాశాలు అందుకుంటుంది. ప్రస్తుతం నేచురల్ స్టార్ నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో కాయదు హీరోయిన్ గా నటిస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా కయాదు లోహర్ చేసిన కొన్ని కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో ఆడవాళ్లను చూపించే విధానంపై కయాదు లోహర్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. సినిమాల్లో మహిళలను కేవలం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ఐటెమ్ లా చూపించే ధోరణిని తాను ఒప్పుకోనని తేల్చి చెప్పింది కాయదు. స్పష్టం చేశారు యంగ్ హీరోయిన్ కయాదు లోహర్. కథ, పాత్ర డిమాండ్ చేస్తే పరిమితులకు లోబడి నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కేవలం లైమ్ లైట్ కోసమో లేదా సోషల్ మీడియాలో ట్రెండ్ అవ్వడానికో అసభ్యకరమైన సన్నివేశాల్లో నటించే ఆలోచన తనకు అస్సలు లేదని చెప్పుకొచ్చింది కయాదు లోహర్. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. అస్సాంలో పుట్టి పెరిగినా దక్షిణాది సినిమా ఇండస్ట్రీలో సత్తా చాటుతోంది కాయదు లోహర్. తన అందం, అభినయంతో కుర్రకారులో క్రేజ్ తెచ్చుకుందీ ముద్దుగుమ్మ. మోడలింగ్ తో కెరీర్ మొదలు పెట్టిన కాయదు లోహర్. ‘టైమ్స్ ఫ్రెష్ ఫేస్’ పోటీల్లో విజేతగా నిలిచి అందరి దృష్టినీ ఆకర్షించిన కయాదు ఆ తర్వాత నటనారంగం వైపు అడుగులు వేశారు. కన్నడలో ‘ముగిల్‌పేటే’ చిత్రంతో కెరీర్ ప్రారంభించింది ఈ ముద్దుగుమ్మ ..



# ‘ఆ ఒక్క విజయం.. పాక్ క్రికెట్ పతనం ప్రారంభం’



పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం ఎదుర్కొంటున్న సంక్షోభానికి ఆ జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ ఒక విచిత్రమైన కారణాన్ని చూపాడు. దుబాయ్‌లో జరిగిన 2021 ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌పై పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో గెలిచిన తర్వాత తమ జట్టు పతనం మొదలైందని అభిప్రాయపడ్డాడు. ఆ విజయం తర్వాత కొంతమంది ఆటగాళ్లు తాము ఏదో గొప్ప విజయం సాధించామని విర్రవీగారని, కెప్టెన్సీ కోసం నెలకొన్న పోటీ డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలను సృష్టించిందని పేర్కొన్నాడు. “2021లో భారత్‌పై మేం గెలిచాం. ఆ మ్యాచ్ మాకు చాలా నష్టం కలిగించింది. ఎందుకంటే ఆ విజయం తర్వాత, తాము ఏదో గొప్ప విజయాన్ని సాధించామని కొందరు ఆటగాళ్లు భావించడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ఏం చేయాలో వారికి అర్థం కాలేదు. మంచి ప్రదర్శన చేస్తున్నప్పుడు వినయంగా ఉండాలి. అహంకారంతో ప్రవర్తిస్తూ అగౌరవంగా వ్యవహరిస్తే సమస్యలు వస్తాయి. పాకిస్థాన్ క్రికెట్‌లో అటువంటి సమస్యలు చాలానే తలెత్తాయి. జట్టులోని ప్రతి ఒక్కరూ కెప్టెన్ కావాలని ప్రయత్నించారు. దాని పర్యవసానాలు ఇప్పటికీ పాకిస్థాన్ క్రికెట్‌కు నష్టం కలిగిస్తున్నాయి. భారత్‌పై విజయం తర్వాత వన్డే, టీ20 ప్రపంచ కప్‌లు, ఆసియా కప్‌లు, ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాక్ చెత్త ప్రదర్శన చేసింది. జట్టు నుంచి మంచి ఫలితాలు రాబట్టడానికి పీసీబీ (రాజదీ) ఎన్నో ప్రయత్నాలు చేసింది. కెప్టెన్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందిని మార్చింది. అయినా ఏ ఆటగాడూ ముందుకు వచ్చి బాధ్యత తీసుకోలేదు” అని మహ్మద్ యూసుఫ్ పేర్కొన్నాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియాతో జరిగిన మ్యాచ్‌లో 152 పరుగుల లక్ష్యాన్ని పాక్ ఒక్క వికెట్ నష్టపోకుండా ఛేదించింది. ఓపెనర్లు బాబర్ అజామ్ (68ని), మహ్మద్ రిజ్వాన్ (79ని) నాటౌట్‌గా నిలిచి జట్టుకు ఘన విజయం అందించిన విషయం తెలిసిందే. పొట్టి వరల్డ్ కప్ చరిత్రలో భారత్‌పై పాక్ గెలవడం అదే మొదటిసారి. ఇక, మహిళల క్రికెట్లో ఎన్నో ఏళ్లుగా పాకిస్థాన్‌పై తిరుగులేని ఆధిపత్యం చలాయిస్తున్న భారత జట్టు.. ఆసియా కప్‌లోనూ పైచేయి సాధించింది. శనివారం గ్రూప్–ఎలో తన చివరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన 7 వికెట్ల తేడాతో పాక్‌ను చిత్తు చేసింది.

## దులీప్ ట్రోఫీ ఫైనల్.. ‘శత’క్కొట్టిన ఇషాన్ కిషన్



చెపాక్ స్టేడియం వేదికగా ఈస్ట్ జోన్, సౌత్ జోన్ మధ్య ఆదివారం దులీప్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఈస్ట్ జోన్ తొలి రోజు ఆట ముగిసేసరికి 4 వికెట్ల నష్టానికి 385 పరుగులు చేసింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (111ని; 135 బంతుల్లో 14 ఫోర్లు, 1 సిక్స్) శతకంతో ఆకట్టుకున్నాడు. వన్‌డౌన్ బ్యాటర్ శిఖర్ మోహన్ (85; 120 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేసే ఛాన్స్ మిస్ చేసుకున్నాడు. ఆరో స్థానంలో వచ్చిన కుమార్ కుశాగ్ర (63ని; 75 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ శతకం సాధించాడు. అంతకుముందు ఓపెనర్లు అభిమన్యు ఈశ్వరన్ (72; 86 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), వైభవ్ సూర్యవంశీ (44; 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) తొలి వికెట్‌కు 100 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి శుభారంభం అందించారు. అభిమన్యు ఈశ్వరన్ రనౌట్ కాగా.. సౌత్ జోన్ బౌలర్లలో చామ మిలింద్ 2, త్రిపురాణ విజయ్ ఒక వికెట్ పడగొట్టారు.




# బ్రో.. ఒక్కసారి స్కోరుబోర్డు చూసుకో..



ఆసియా కప్‌లో భారత్ వరుసగా విజయాలతో దూసుకుపోతోంది. శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను భారత్ చిత్తుచిత్తుగా ఓడించింది. ఆ జట్టును 18.1 ఓవర్లలో 55 పరుగులకే ఆలౌట్ చేసి ఈ స్వల్ప లక్ష్యాన్ని 8.4 ఓవర్లలో ఛేదించింది. భారత్ చేతిలో ఘోర ఓటమి చవిచూసినా పాక్ పోకడ మాత్రం తగ్గడం లేదు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఆ జట్టు కోచ్ వహాబ్ రియాజ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఆసియా కప్‌లో తమదే అత్యుత్తమైన టీమ్ అని వ్యాఖ్యానించాడు. ‘ఈ ఆసియా కప్‌లో ట్రోఫీని గెలుచుకునే సత్తా పాకిస్థాన్‌కే ఉందని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను. ఎందుకంటే ఇక్కడి పరిస్థితులు మాకు బాగా అనుకూలంగా ఉన్నాయి. భారత్‌తో మ్యాచ్‌లో చేసిన తప్పుల గురించి చర్చించుకుంటాం. ఆ తప్పులు మళ్లీ చేయకుండా ప్రయత్నిస్తాం” అని వహాబ్ రియాజ్ పేర్కొన్నాడు. పాక్ కోచ్ వ్యాఖ్యలపై నెటిజన్లు సెటైరికల్‌గా స్పందిస్తున్నారు. “అవును.. వాళ్లదే అత్యుత్తమ జట్టు. కానీ ట్రోఫీని సాధించడానికి వాళ్లకు మ్యాచ్‌లు గెలవాల్సిన అవసరం లేదు. ట్రోఫీని అందుకుని అక్కడి నుంచి పారిపోయేందుకు మోసిన్ నఖ్వీ లాంటి వాళ్లు ఉంటే చాలు” అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. “మీడియా ముందుకు వచ్చే ముందు వాళ్ల స్కోరు బోర్డు చూడటం మర్చిపోయాడేమో.. అందుకే ఇలా మాట్లాడుతున్నాడు” అని మరో యూజర్ రాసుకొచ్చాడు. ‘వహాబ్ రియాజ్ మొదట సెలక్టర్.. ఆ తర్వాత సలహాదారు. ఇప్పుడు కోచ్. పాకిస్థాన్ క్రికెట్‌ను నాశనం చేసిన వారిలో ఇతను కూడా ఉన్నాడు. ఇలాంటి పదవులకు ఎలా అర్హత సాధిస్తారో నాకు అస్సలు అర్థం కావట్లేదు” అని ఓ పాక్ అభిమాని కామెంట్ పెట్టాడు. ఈ ఆసియా కప్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతుండగా.. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. పాకిస్థాన్ ఇప్పటివరకు రెండు లీగ్ మ్యాచ్‌ల్లో ఒకటే (థాయ్‌లాండ్‌పై) గెలిచింది. దాయాది జట్టు చివర మ్యాచ్ హాంకాంగ్‌తో ఆడనుంది. అందులో గెలిస్తే పాక్ సెమీస్‌కు చేరుతుంది.

## సాత్విక్-చిరాగ్ జోడీకి చైనా మాస్టర్స్ టైటిల్



భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజు, చిరాగ్ శెట్టి చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ నం.5 సాత్విక్, చిరాగ్ జంట 11-21, 21-13, 21-17 తేడాతో హె జి టింగ్, రెన్ జియాంగ్ యు (చైనా) ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది. గంట 10 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో తొలి గేమ్‌లో భారత జోడీ నిరాశపర్చింది. తర్వాత పుంజుకున్న భారత ద్వయం రెండు గేమ్‌ల్లో దూకుడుగా ఆడి చైనా జోడీని మట్టికరిపించింది. ఈ టోర్నీలో 2023, 2025లో రన్నరప్‌గా నిలిచిన సాత్విక్, చిరాగ్ జంట మూడో ప్రయత్నంలో చైనా మాస్టర్స్ సూపర్ సిరీస్ 750 టైటిల్‌ను దక్కించుకుంది.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com